తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్

: fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-3-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 36 పేజీలు: 8+16 వెల: 8.00


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


మహిళా శక్తితోనే మరింత అభివృద్ధి: రాష్ట్రపతి

ఎన్టీపీసీ డిజిఎం కాల్చివేత

5




హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఎంపిల సమావేశంలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు

# ఒకే మాటతో నడుద్దాం

## తెలంగాణ ప్రయోజనాల కోసం కలిసి సాగాలి

## కేంద్రం నుంచి నిధుల కోసం పోరాడుదాం: ఎంపీల సమావేశంలో డి.సిఎం భట్టి

### హాజరుకాని బిజెపి, బిఆర్ఎస్

### ఎంఐఎం తరపున అసదుద్దీన్ రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి8:** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం ఏకం కావాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి మన సమస్యలను వివరించాలని ఆయన అన్నారు. ఉన్నత భావాలతో ఎంపీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రం నుండి రావాల్సిన నిధుల కోసం పోరాడాల్సి ఉందని ఆయన అన్నారు. ప్రజాభవన్‌లో భట్టి అధ్యక్షతన శనివారం తెలంగాణ రాష్ట్ర ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ >>2

గురుకులాలకు మహిళా సంఘాల నుంచి పౌష్టికాహారం

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

ఇందిరా మహిళా శక్తి సభలో సిఎం రేవంత్

మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్, ఆర్టీసీ బస్సులు అందజేత

ఇందిరా మహిళా శక్తి పాలసీ ఆవిష్కరణ



సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

# మహిళా సంఘాలకు రైస్ మిల్లులు.. గోదాములు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి8:** రాబోయే రోజుల్లో ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు ఏర్పాటు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం, తాను తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో మహిళా సంఘాల కొనుగోలు చేసే వడ్లను ఆ గోదాముల్లో నిల్వ చేయడంతో పాటు మిల్లింగ్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా సంఘాలకే అప్పచెబుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఇందిరా మహిళాశక్తి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. >>2



శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఇందిరా మహిళా శక్తి సభకు హాజరైన అశేష ప్రజానీకం

# సిఎం రేవంత్, భట్టి ఢిల్లీ పర్యటన రద్దు

## నేడు కెసి వేణుగోపాల్ ఫోన్‌ద్వారా సంప్రదింపులు

### ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై కసరత్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి8:** ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై తుది కసరత్తు చేసేందుకు ఢిల్లీకి వెళ్లాల్సిన సిఎం రేవంత్‌రెడ్డి చివరి నిమిషంలో పర్యటన రద్దు చేసుకున్నారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్ ఢిల్లీలో అందుబాటులో లేకపోవడంతో సిఎంతో సహా డిప్యూటీ సిఎం మల్లు భట్టి >>2



# స్టాలిన్, రేవంత్‌వి బోగస్ మాటలు

## దక్షిణ భారత్‌లో ఒక్క ఎంపి సీటు తగ్గదు

### రీజినల్ రింగ్ రోడ్డు కోసం రూ.18,772కోట్లతో అంచనాలు సిద్ధం చేశాం

### స్థల సేకరణ కారణంగా పనులు జాప్యం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి8, ప్రభాతవార్త:** డిలిమిటేషన్ వల్ల దక్షిణ భారత్‌లో ఒక్క ఎంపి సీటు తగ్గదు.. తెలంగాణ ప్రయోజనాల గురించి చేతులెత్తేసిన సిఎం తమకు చెప్పాల్సిన అవసరం లేదని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రధాని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తమదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గానీ, దక్షిణ భారతదేశంలో గానీ ఒక్క సీటు కూడా తగ్గదని అన్నారు. తెలంగాణలో ఓట్లు తగ్గినా, జనాభా తగ్గినా పార్లమెంట్ సీట్లు తగ్గబోవని స్పష్టం చేశారు. ఈ >>2



# జంట జలాశయాలకు గోదావరి జలాలు

## టెండర్లు పిలిచిన సర్కార్

**హైదరాబాద్, మార్చి 8 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లను గోదావరి నీటితో నింపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గోదావరి తాగునీటి సరఫరా పథకం కింద మూసి నది పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 5383.67 కోట్ల రూపాయల వ్యయంతో హైదరాబాద్ మెట్రో పాలిటిన్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ సర్కిల్ 2 చీఫ్ జనరల్ మేనేజర్ టెండర్లు పిలిచారు. మొదటి ప్యాకేజీ 3330.95 కోట్లతోనూ, ఇంకో ప్యాకెజి 2052.72 కోట్లతో టెండర్లు పిలిచారు. గోదావరి రెండు, మూడవ దశలలో వీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నింపినున్నారు. 3000 ఎంఎం డయా పైపులను రెండు వరుసలలో వేయనున్నారు. ప్రతి వరుసులో 10 టిఎంసిల నీటిని పంపింగ్ చేయనున్నారు. మొదటి ప్యాకేజీల రూ.3225.47కోట్లతో చేపట్టనున్నారు. ప్రతి సంవత్సరం నిర్వహణ కోసం రూ.105.48 చొప్పున 10 సంవత్సరాల పాటు నిర్వహణ ఏజెన్సీ >>2









అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అగర్తలాలో నిర్వహించిన ర్యాలీలో ప్లకార్డును ప్రదర్శిస్తున్న మహిళ

## వచ్చే ఎన్నికల్లో 33శాతం ఎమ్మెల్యే, ఎంపి
# టిక్కెట్లు మహిళలకే
### రూ.22,793 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేసిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి8:** ఎస్సెల్బీసీ టన్నెల్ కూలినా, రోడ్డుపై ప్రమాదం జరిగి మనుషులు చనిపోయినా.. ఎండలతో పంటలు ఎండినా బీఆర్ఎస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని. సంబురాలు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అంతార్జతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సభలో సిఎం ప్రసంగించారు. పదేళ్ల అధికారంలో ఉన్న వారికి పది నెలల పాలనపై ఏడుపు ఎందుకని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కెసిఆర్,కెటిఆర్‌లు కుల గణనలో పాల్గొనాలని సూచించారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో తెలంగాణలో చంద్రగ్రహణం తొలగిపోయిందని,మంచి రోజులు వచ్చాయని వ్యాఖ్యానించారు. 65లక్షల మంది స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, వీరిని కోటీ మంది సభ్యులుగా పెంచేందకు మహిళా సంఘాల సభ్యుల వయో పరిమితిని 60 నుంచి 65కు పెంచామని, సభ్యత్వం పొందేందుకు 18 నుంచి 15 ఏళ్లకు కుదించామని చెప్పారు. దీంతో 10వ తరగతి పాస్ అయిన ఆడబిడ్డలు కూడా మహిళా సంఘాల్లో సభ్యత్వం పొంది ఆర్థికంగా ఎదుగవచ్చునని చెప్పారు.


శనివారం హైదరాబాద్‌లో చాకలి ఐలమ్మ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

పాఠశాలల నిర్వహణ,బడి పిలల్లకు కోటీ 30లక్షల జతల యూనిఫామ్ కుట్టించే పని మహిళలకే అప్పగించామన్నారు. జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలను కేటాయించామని, వాటి నిర్మాణం కోసం రూ. 25కోట్లు చొప్పున కేటాయించామన్నారు. 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళా సంఘాలకు ఇచ్చామని, ఆ విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖకు అమ్ముకోవచ్చని చెప్పారు. ఆర్టీసీలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను మహిళా సంఘాలకే లీజ్‌కు ఇస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో 33 శాతం మహిళలకు ఎమ్మెల్యే,ఎంపీ టిక్కెట్లు ఇస్తామని, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం ఉన్న మహిళలకు టిక్కెట్లు ఇచ్చి గెలిపిస్తామన్నారు. సభ అనంతరం రూ.22,793 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును, బీమా, ప్రమాద బీమా పథకాలకు సంబంధించిన రూ.44.80 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాలకు అందజేశారు. పాటల రచయిత చరణ్ కౌశిక్, గాయని మధుప్రియ తదితరులను ముఖ్యమంత్రి సత్కరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్స్‌కు వర్చువల్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళాశక్తి మిషన్-2025 పాలసీని ఆవిష్కరించారు. సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫాల్కన్ ఇన్వాయిస్ స్కాం..
### క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి ప్రైవేట్ జెట్ జప్తు చేసిన ఇడి

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాలలో అమాయకులను అధిక వడ్డీ పేరిట నిండా ముంచి 1700 కోట్ల రూపాయలను కాజేసిన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ స్కీం) గోల్‌మాల్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కంపెనీ ఎండి అమర్‌దీప్ కుమార్‌కు చెందిన ప్రైవేట్ జెట్ విమానాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో నాటకీయ ప క్కీలో జప్తు చేశారు. హైటెక్ సిటీ కేంద్రంగా 2021లో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ప్రారంభమైన ఈ కంపెనీ గత జనవరి నెలలో బిచాణా ఎత్తే యడం తెలిసిందే. కంపెనీ ఏజెంట్లను నియమించుకుని బీద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులకు ఆకర్షణీయ పథకాల పేరిట వల విసిరి 1700 కోట్ల రూపాయలను ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా స్వీకరించింది. తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని డిపాజిటర్లను నమ్మ బలికి ఆనక బోర్డు తిప్పేసింది. కేవలం 45 రోజుల నుంచి 180 రోజుల్లో 11 నుంచి 22 శాతం రిటర్న్ వస్తాయని చెప్పడంతో వందల సంఖ్యలో బీద, మధ్య తర గతి వారు, చిరు వ్యాపారులు ఈ సంస్థలో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మోసపోయారు. జనవరి నెల 15వ తేదీన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లి మిటెడ్ సంస్థ బోర్డు తిప్పేయగా అంతకు ముందే కంపెనీ అధినేత అమర్‌దీప్ కుమార్ సహా కీలక నిందితులు ఆర్యన్ సింగ్, యుగందర్ విదేశాలకు ఉడాయించారు. దీ నిపై విచారించిన పోలీసులు కంపెనీ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ ఓదెల, డైరక్టర్ కావ్య నల్లూరిని అరెస్టు చేశారు. విదేశాలకు ఉడాయించిన వారి కోసం పోలీసులు లు కవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసుపై రంగంలో దిగిన ఈడీ అధికారులకు శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయ అధికారుల నుంచి అమర్‌దీప్ కుమార్‌కు చె ందిన ప్రైవేట్ జెట్ విమానం లాండ్ అయినట్లు సమాచారం అందగా వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని దానిని జప్తు చేశారు. మెడికల్ ఎమ్మర్జన్సీ పేరిట ఈ వి మానం శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా లాండ్ అవగా దీనిపై విచారించిన విమానాశ్రయ అధికారులు అలాంటిది ఏమీ లేకపోవడంతో ఈడీ అధికారుల కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు రంగంలో దిగి దీనిపై విచారణ చేయగా ఈ విమానం అమర్‌దీప్ కుమార్‌దిగా తేలింది. ఈ విమానంలో వున్న 12 మందిని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో 12 గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది.

# ఒకే మాటతో నడుద్దాం

>> సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలతో పాటు మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. కాగా, బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు గైర్హాజరయ్యారు.కేంద్రం వద్ద పెండింగులో ఉన్న బిల్లులపై ఈ సమావేశంలో చర్చించారు. విభజన సమస్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, రావాల్సిన అనుమతుల వివరాలను రెండు పుస్తకాల రూపంలో ఎంపీలకు అందజేసినట్లు తెలిపారు. తెలంగాణ ఎంపీల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు హామీలపై చర్చించిన ఎంపీలు .. కేంద్రానికి పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం 28 అంశాలపై చర్చించి ప్రతిపాదనలు రూపొందించారు. మెట్రో రెండో దశ, మూసీ రివర్ అభివృద్ధి ప్రాజెక్ట్, బాపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం సహా పలు ప్రధాన అంశాలను అందులో పొందుపర్చారు. వీటికి కేంద్రం అనుమతులు, నిధులు మంజూరు చేసేలా తెలంగాణ ఎంపీలు పావులు కదపనున్నారు. ఆ 28 అంశాలు ఇవే... ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ఆమోదం, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ రేడియల్ రోడ్ల అభివృద్ధి,మెట్రో రెండో దశ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్ట్, బాపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం, గోదావరి -మూసీ నది లింక్ ప్రాజెక్ట్, హైదరాబాద్ కోసం మురుగునీటి పారుదల మాస్టర్ ప్లాన్, వరంగల్ భూగర్భ డ్రైనేజీ ప్రణాళిక, బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ సమీపంలోని డ్రై పోర్టు వరకూ గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఎస్‌సీసీఎల్ కోసం బొగ్గు బ్లాకుల కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్, ఐపీఎస్ కేడర్ సమీక్ష, పీఎస్ డీఎఫ్ కింద పథకాల మంజూరు, పీఎం కుసుమ్- ఏ,బీ,సీ కింద కేటాయింపు,తాడిచెర్ల బొగ్గు బ్లాక్2 మైనింగ్ లీజు, వివిధ కార్పొరేషన్లు/ఎస్‌పీవీల రుణ పునర్నిర్మాణం, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద తెలంగాణ గవర్నమెంట్‌కు చెల్లించాల్సిన గ్రాంట్ విడుదల కోసం అభ్యర్థన, 2014-15 ఆర్థిక సంవత్సరానికి సీఎస్ఎస్ నిధుల విడుదలలో లోపాన్ని సరిదిద్దమని అభ్యర్థన, ఏపీబిల్డింగ్,ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు,కార్మిక సంక్షేమ నిధిలో తెలంగాణకు వాటా కోసం నిధులను బదిలీ చేయాలని అభ్యర్థన,ఏపీ పవర్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన మొత్తానికి సంబంధించి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి,తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి, రాష్ట్రంలో రైల్ల కనెక్టివిటీ పెంచాలని విజ్ఞప్తి, ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, వెనకబడిన ప్రాంతాలలో రోడ్డు కనెక్టివిటీని మెరుగుపరచడం,పీఎం మిత్రా పార్క్ పథకం కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు,అన్‌కవర్డ్ జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు చేయాలని కేంద్రంపై ఎంపీలు ఒత్తిడి చేయనున్నారు.కాగా, ఒక రోజు ముందు కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌తో పాటు బిజెపి ఎంపిలందర్ని భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. కేంద్ర మంత్రులకు ఫోన్ కూడా చేశారు. అయితే బిజెపి ఎంపీలెవ్వరూ హాజరు కాలేదు. ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఖరారైన కార్యక్రమాలు ఉండటంతో తాము రాలేమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ ద్వారా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు సమాచారం ఇచ్చారు. ఎంపిల సమావేశంపై లేఖ పంపినందుకు భట్టికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపిల మీటింగ్ కు బిజెపి నుంచి హాజరుకాలేకపోతున్నామని,రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన లేఖ ఆలస్యంగా అందడంతో పార్టీలో చర్చించుకునే సమయం లేదన్నారు.ఇప్పటికే తమకు ఎన్నో అధికారిక కార్యక్రమాలు ఖరారయ్యాయని వివరించారు. భవిష్యత్‌లో సమావేశం నిర్వహించాలనుకుంటే కాస్త ముందుగా తెలియజేయగలరని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సైతం ఆకస్మికంగా సమావేశం పెట్టడంతో హాజరుకాలేకపోతున్నామని, మరోసారి ఇటువంటి సమావేశం నిర్వహిస్తే ముందుగానే సమాచారం ఇవ్వాలని భట్టిని ఆ పార్టీ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ పార్టీ ఎంపీలు హాజరుకాకపోవడంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ బీ టీం అని మరోసారి రుజువైందన్నారు. కేసులు ఉన్నాయి కాబట్టే వారు కేంద్రంపై పోరాటం అంటే సమయానికి ఎగ్గొడతారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు సొంత ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. అందుకే అఖిలపక్ష ఎంపీల సమావేశానికి రాలేదన్నారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పదే పదే కోరే బీఆర్ఎస్ ఈరోజు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్రంపై ఏ విధంగా పోరాటం చేయాలో ఎందుకు చెప్పలేదని మంత్రి విరుచుకుపడ్డారు.

# గోదావరి జలాలు

>> ఉండనుంది. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు నిర్మాణం చేయనున్నారు. అదే విధంగా ఎలక్ట్రో మెకానికల్ సబ్‌స్టేషన్‌ను మల్లన్నసాగర్ వద్ద నిర్మించనున్నారు. 1170 ఎంఎల్‌ఎడి డబ్ల్యుటిపి, 40ఎంఎల్ క్లీయర్ వాటర్ రిజర్వాజర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలు మొత్తం ఘన్‌పూర్ వద్ద హైబ్రీడ్ యాన్యుటీ పద్ధతిలో నిర్మాణం చేపట్టనున్నారు. 10 సంవత్సరాల పాటు ఈ ఆపరేషన్, నిర్వహణ మొత్తం ఏజెన్సీ చూసుకోవాల్సి ఉంటుంది. ఇక రెండో ప్యాకేజీ రూ.199.22కోట్లతో చేపట్టనున్నారు. ప్రతి సంవత్సరం ఆపరేషన్, నిర్వహణ కోసం రూ.60.50కోట్లతో పదేళ్ల ఏజెన్సీ చూసుకోవాల్సి ఉంటుంది. మొత్తం దీని వ్యయం రూ.2052.72కోట్ల ఖర్చు చేయనున్నారు. 2200 ఎంఎస్ పంపింగ్ ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సారగ్ వరకు, 3000 ఎంఎం దయా ఎంఎస్‌పైప్‌లైన్ కోకాపేట నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు, ఓఆర్ఆర్, 2200లు ఇంటర్ కనెక్షన్ ఉస్మాన్‌సాగర్, ఉస్మాన్‌నగర్ వద్ద ఇవ్వనున్నారు. డబ్ల్యుటిపి 300 ఎంఎం దయా ఎంస్ పంపింగ్ చేపట్టనున్నారు. 18ఎంఎల్ రా వాటర్ రిజర్వాయర్, పంప్‌హౌజ్‌లు నిర్మాణాలు చేపట్టనున్నారు. 70 ఎంఎల్‌డి డబ్ల్యుటిపి, 19 ఎంఎల్, సిడబుల్యఆర్, పంప్‌హౌజ్‌లు ఎలక్ట్రో మెకానికల్, 1000 దయా ఎంఎస్ పంపింగ్‌లు నిర్మాణం చేపట్టనున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 9-03-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల దశమి ఉ.7.46
పునర్వసు రా.11.54
వర్జ్యం ఉ.8.13-9.53
దు.సా.4.45-5.33
శుభసమయం :ఉ.6.00-7.00, సా.6.40-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఊహించని ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. బంధువులను కలుస్తారు.

**వృషభం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. రుణ బాధలు తప్పవు.

**మిథునం:** అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** కీలక వ్యవహారాలలో నిదానం అవసరం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృశ్చికం:** మిత్రుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది. శ్రమ తప్ప ఫలితం ఉండదు.

**కుంభం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవ్‌సరిలో శనివారం లఖ్‌పతి దీదీలతో మాట్లాడుతున్న ప్రధాన మంత్రి మోడీ

# రైస్ మిల్లులు.. గోదాములు

>> ఐకేపీ కేంద్రాల నుంచి వడ్లు తీసకుంటున్న కొందరు మిల్లర్లు పందికొక్కుల్లా వాటిని కాజేస్తున్నారని, వాటిని తిరిగి ఇవ్వడం లేదని, లెక్కలు చెప్పడం లేదని సీఎం విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోదాముల నిర్మాణం మహిళా సంఘాలు చేపట్టేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ప్రభుత్వమే స్థలం ఇవ్వడంతో పాటు రైస్ మిల్లులు, గోదాముల నిర్మాణాలకు అవసరమైన రుణాలు ఇప్పిస్తుందని సీఎం తెలిపారు. మహిళా సంఘాలు తమపై కాళ్ల నిలబడినప్పుడే తెలంగాణ రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాల కాలేజీల్లో విద్యార్థులకు పౌష్టికాహారం మహిళా సంఘాల నుంచి సరఫరా చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెర్ప్ సీఈవోను ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణలో మహిళా సంఘాలకు, ఆడ బిడ్డలకు చంద్ర గ్రహణం తొలగిందని, స్వయం సహాయక సంఘాల మహిళలు మండల కేంద్రాలకు వెళ్లే అవకాశం లేకుండా నాడు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆడ బిడ్డలు నిర్ణయం తీసుకొని ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆశీర్వదించడంతో 15 నెలల క్రితం ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని సీఎం అన్నారు. ఇప్పుడు ఆడ బిడ్డలు తలెత్తుకొని వెలుగు, స్వేచ్ఛను చూస్తున్నారన్నారు. పదేళ్ల నాటి పాలనను ఏడాది తమ పాలనను మహిళలు స్వయంగా చూస్తున్నారని సీఎం తెలిపారు. మంత్రులు, అధికారులను సమన్వయం చేసి సంఘాలను బలోపేతం చేయాలని తాము నిర్ణయించామని, సంఘాలు బలోపేతమైనప్పుడే తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.ఐకేపీ సెంటర్లు నిర్వహించే మహిళలకు గతంలో డబ్బులు ఎప్పుడు ఇస్తారో తెలియదని, తాము వెంటనే చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను సంఘాలకే అప్పగించామని, గతంలో జత బట్టలు కుడితే రూ.25 ఇస్తే తాము దానిని రూ.75కు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి సమావేశాలకు భవనాలు ఉండాలని నిర్ణయించి ప్రతి జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి సంఘం భవనానికి అనుమతించి ప్రతి భవనానికి రూ.25 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. అదానీ, అంబానీలు మాత్రమే నిర్వహించే సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాల చెంతకు చేర్చామని సీఎం అన్నారు. మహిళా సంఘాలు 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు నిర్వహించి విద్యుత్ శాఖకు అమ్మేలా చేశామన్నారు. సోలార్ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నామంటే అందుకు తమకు ఆడ బిడ్డలపై తమకు ఉన్న నమ్మకమే కారణమన్నారు. కేసీఆర్ బంధువులు, పెట్టుబడిదారులకే పరిమితమైన ఆర్టీసీ బస్సుల లీజులను మా బంధువులుగా భావించే సంఘాల్లోని మహిళలకు తాము అప్పగించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా సంఘాలు ఆర్టీసీకి 1000 బస్సులు లీజుకు ఇస్తున్నాయని, ఇవ్వాళే 150 ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీకి సంఘాలు అందజేశాయని సీఎం వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌తో మహిళా సంఘాలు పోటీపడేలా హైటెక్ సిటీ పక్కన ఇన్ఫోసిస్, విప్రో వంటి ప్రముఖ సంస్థల పక్కన మహిళా సంఘాలకు 150 షాపులు కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అక్కడ సంఘాలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ కార్పొరేట్ సంస్థలతో పోటీపడాలని, తాము అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి అభయమిచ్చారు. రానున్న రోజుల్లో మహిళా సంఘాలు ఉత్పత్తులకు పన్నుల మినహాయింపుతో పాటు ముడి సరకు కొనుగోలుకు అవసరమైన రుణాలు ఇప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేసీఆర్ తొలి అయిదేళ్ల తన మంత్రివర్గంలో మహిళలను తీసుకోలేదని, ఈ రోజు మంత్రులుగా ఉన్న కొండా సురేఖ, సీతక్క మహిళల తరఫున నిలబడి కొట్లాడుతున్నారని, మహిళాల పక్షాన మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.మహిళలు పరిపాలనలో భాగస్వాముల కావాలని రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారని, మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎదగాలని సోనియా గాంధీ మహిళా రిజర్వేషన్లకు ఆమోదం తెలిపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. సంఘాల్లోని మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే వారికి సీట్లు ఇచ్చి గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆడ బిడ్డల సంక్షేమమే ఎజెండాగా మొదటి సంవత్సరంలోనే రూ.21 వేల కోట్ల జీరో వడ్డీ రుణాలు ఇచ్చి మహిళలు తలెత్తుకునేలా చేశామని సీఎం తెలిపారు. ప్రస్తుతం మహిళా సంఘాల్లో 65 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, వారి సంఖ్యను కోటికి పెంచేందుకు వీలుగా సంఘాల్లో చేరే మహిళల వయస్సును 18 నుంచి 15 ఏళ్లకు తగ్గించడంతో పాటు 60 ఏళ్లకుపైన ఉన్నవారిని తీసుకుంటామని సీఎం వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని సీఎం స్పష్టం చేశారు. మొదటి తరం ఇందిరమ్మను అమ్మ అని పిలిచారని, రెండో తరం ఎన్టీఆర్‌ను అన్నను చేశారని.. ఇప్పుడు రేవంతన్నగా మీరంతా తనను పిలుస్తున్నారని సీఎం అన్నారు. తనను కుటుంబ సభ్యునిగా భావిస్తున్నారని, అన్న అంటే ఆ కుటుంబాల బాధ్యతను తీసుకోవడమేనని సీఎం భావోద్వేగంతో అన్నారు. ఇది పేగు బంధానికి అతీతమైందని, ఆడ బిడ్డల ఆశీర్వాదంతోనే తాను ఈ రోజు మీ ముందు నిలబడగలిగానని, ఈరోజు తానుతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిలబడి మాట్లాడుతున్నానంటే అందుకు ఆడబిడ్డల ఆశీర్వాదమే కారణమని సీఎం అన్నారు. ఇందిరమ్మ శక్తి... ఎన్టీఆర్ యుక్తిని స్ఫూర్తిగా తీసుకొని కోటి మందిని అభివృద్ధిని పథంలోకి తీసుకెళతానని సీఎం తెలిపారు.


# సిఎం రేవంత్, భట్టి ఢిల్లీ పర్యటన రద్దు

>> విక్రమార్క,మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్,కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తమ పర్యటన రద్దు చేసుకున్నారు. నామినేషన్ల దాఖలు ఆఖరు గడువు సమీపిస్తున్నందున కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపై అభిప్రాయ సేకరణ చేసేందుకు ఆదివారం ఉదయం 11 గంటలకు కేసి వేణుగోపాల్ స్వయంగా ఫోన్ చేసి కాంగ్రెస్ రాష్ట్ర పెద్దలతో నేరుగా చర్చించనున్నట్లు సమాచారం.

అభ్యర్థిత్వాలపై అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే పేర్లను ఆదివారం ఖరారు చేవేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ 3 ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ఖరారు చేయనుంది. ఒక ఎమ్మెల్సీ స్థానం సిపిఐకి ఇచ్చేందుకు అధిష్ఠానం సన్నద్ధమైనట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థులు సోమవారంనాడు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

## కుటుంబాన్ని చిదిమేసిన
# కారు ప్రమాదం..
### కాలువలో మృతదేహాలు వెలికితీత

**హన్మకొండ బ్యూరో, మార్చి8. ప్రభాత వార్త:** జిల్లాలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. స్వగ్రామానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మార్గ మధ్యలోనే మృత్యువు కాటేసింది. ఈ ఘటనలో తండ్రి, కుమార్తె, కుమారుడు మృతి చెందగా, భార్య ప్రాణాలతో బయటపడింది. వివరాల్లో వెళితే.. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లికి చెందిన ప్రవీణ్ కుటుంబంతో సహా హనుమకొండలో ఉంటున్నారు. శనివారం స్వగ్రామానికి వెళ్లేందుకు భార్య, పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. సంగెం మండలం తీగరాజుపల్లి వద్దకు రాగానే ప్రవీణ్‌కు ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో వరంగల్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుందామని వెనుదిరిగారు. యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఎస్ఆర్ఎస్పీ కాల్వలో పడింది. కాల్వలో కొట్టుకుపోతున్న కృష్ణవేణిని స్థానికులు గమనించి రక్షి ంచారు. సాయివర్ధన్ (2) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ (34), కుమార్తె చైత్రసాయి(4) గల్లంతయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కాలువలో నీటి ప్రవాహన్నా తగ్గించి గాలింపు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సాయంతో కారుతో పాటు గల్లంతైన ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. ఘటనా స్థలిలో కుమారుడు సాయివర్ధన్ మృతదేహాన్ని హత్తుకుని కృష్ణవేణి రోధిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. సంతోషంగా స్వగ్రామానికి వెళ్తోన్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం చిన్నాభిన్నం చేయడంతో ప్రవీణ్ స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.


సంగెం మండలం తీగరాజుపల్లి వద్ద శనివారం కాలువ నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

# బోగస్ మాటలు

>>విషయాన్ని స్వయానా ప్రధాని మోడీ లోక్ సభలో చెప్పారని అన్నారు. దక్షిణ భారతదేశంలో సీట్లు తగ్గే అంశంపై స్టాలిన్, రేవంత్‌లుమాట్లాడుతున్నవన్నీ బోగస్ మాటలేనని అన్నారు. జనాభా సేకరణ, రీ ఆర్గనైజేషన్ కమిటీ ఏర్పాటు,అనంతరం గైడ్‌లైన్స్ విడుదలవుతాయన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు రానుండడంతో చెప్పుకోవడానికి ఏమీ లేదనందున తమిళనాడును దోచుకున్న స్టాలిన్ కుటుంబం ఓట్ల కోసం అసత్య వాదనలను తెరపైకి తెస్తుందని మండిపడ్డారు. నాలుగున్నరేళ్లలో ఏంచేశారో చెప్పుకోవాల్సింది పోయి, హిందీ భాషకు రంగులువేయాలని ప్రజలనుతప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తమిళభాషకు పెద్ద పీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమిళ కాశీ, గుజరాత్, తెలుగు తమిళ సంఘాన్ని ఏర్పాటు చేశారని, తమిళభాషపై అనేక రీసెర్చ్‌లు జరుగుతున్నాయని అన్నారు. నూతన ఎడ్యుకేషన్ పాలసీలో మాతృభాషకు ప్రాధాన్యం ఇచ్చే చర్యలు చేపట్టిన తొలి ప్రభుత్వం, 76ఏళ్ల తరువాత నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం మోడీ ప్రభుత్వమేనన్నారు. కోచ్ ఫ్యాక్టరీకి కొంతభూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాల్సి ఉందని, పనులు చకచకా జరుగుతున్నాయని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VI
**కలెక్టర్ వరంగల్ జిల్లా గారి ప్రాథమిక ప్రకటన**
(చట్టం-30/2013లోని సెక్షన్-11(1) సబ్ రూల్-(1) రూల్-19 ప్రకారం)
వరంగల్ జిల్లా రాజ పత్రము నెం: 03/వరంగల్/2024, తేది: 14.02.2025
శ్రీయుత జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఉత్తర్వులు నెం.ఇ./1495/2025 తేది: 14.02.2025
ఫైల్ నెం.: బి/1050/2024 తేది: 23.12.2024
శ్రీయుత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, I & CADD, నర్సంపేటగారి రిక్విజిషన్ ప్రకారం ఈ దిగువ నిర్దిష్టపరచిన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మన్నాపూర్ గ్రామ శివారులోని భూమి విస్తీర్ణం ఎ.01.02¾ గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా మన్నాపూర్ గ్రామములో కొనాయమకుల లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయనైనది.
ప్రభుత్వ ఉత్తర్వు నెం.55, IRRIGATION & CADD (LA.R&R/A2) DEPARTMENT, తేది: 25.07.2017 ప్రకారం, ప్రతిపాదిత భూసేకరణ భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016లోని చాప్టర్ IIIA లోని సెక్షన్ 10(A) క్రింద గుర్తించబడినది. కావున, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం (నం.30/2013)లోని చాప్టర్ 2లోని సామాజిక ప్రభావము అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.
**షెడ్యూలు**
గ్రామం : మన్నాపూర్ మం: గీసుగొండ జిల్లా : వరంగల్

| క్రమ సంఖ్య | సర్వే నెం./ బంటి నెం. | మూల మస్తు వు హద్దు | భూమి రకం | భూసేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గుం.లో) | భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు | సరిహద్దులు | | | | చెట్లు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | తూ | ప | ద | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | | | | 8 |
| 1 | 252 | పట్టా | ఖుష్కి | 01.02 ¾ | తలకోటి ఉమాదేవి భర్త: భాస్కరలింగం | 252 /3 | 252 /1 | 252 /1 | 264 /3 | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణలో సముచిత పరిహారం మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, 2013 (నెం. 30/2013) నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం రీడ్ విత్ తెలంగాణ సవరణ చట్టం, 2016 (నెం.21/2017) సంబంధిత భూయజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకూను నోటిఫికేషన్ జారీచేయనైనది.
భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టరు, వరంగల్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భూసేకరణ అధికారి/రెవిన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రవేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సదరు చట్టములోని సెక్షన్ 11(4) ప్రకారం, భూసేకరణ ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, వరంగల్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి జాబితాలో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయనైనది.
ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములుగాని ఆక్షేపణలుగాని ఉన్న యెడల పరిష్కారం కొరకు ప్రభావితమైన/ప్రయోజనము గల వ్యక్తులందరూ సదరు చట్టంలోని సెక్షన్ (15) ననుసరించి ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల జిల్లా కలెక్టర్, వరంగల్ లేదా భూసేకరణ అధికారి/రెవిన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ గారికి లిఖితపూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.
సం/- భూసేకరణ అధికారి మరియు, రెవిన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ | సం/- అదనపు కలెక్టర్ (రె), వరంగల్ | సం/- జిల్లా కలెక్టర్, వరంగల్
DIPR RO.NO: 750/LA/PP/Advt/Pub/2024-25

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
కలెక్టర్ కార్యాలయం, హనుమకొండ

**ఫారం-VI**

**నోటిఫికేషన్**

(చట్టము-30/2013లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

కలెక్టరు ఫైల్ నెం. జి/1341/2017-9 తేది: 23.01.2025
ఆర్.డి.ఒ ఫైల్ నెం. జి2/1598/2024 తేది: 20.01.2025
గెజిట్ నెం. 07/HNK/2025 తేది: 23.01.2025

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలము వంగర గ్రామము పరిధిలో ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన భూమి విస్తీర్ణము (30-29) గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా MAJOR-2L of Distributory-5 on Gouravelly Right Side Main Canal of Gouravelly Canal Project from 0.000 to 4.125 km అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్ హనుమకొండగారు భావిస్తున్నారు కావున ఇట్టి ప్రకటన జారీచేయనైనది.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ 2013 భూసేకరణ చట్టంలోని Chapter-II & Chapter - III అనగా సామాజిక ప్రభావిత అధ్యయనము మరియు ఆహార భద్రత నుండి భూసేకరణ పునరావాస, పునర్నిర్మాణ కల్పనకు పారదర్శకత & హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు 2013, (తెలంగాణ సవరణ) చట్టము 2016లోని సెక్షన్ 10(ఎ) ద్వారా మినహాయింపు జమా ఉత్తర్వులు జారీ చేయనైనది.

**షెడ్యూలు**

గ్రామం : వంగర మండలం : భీమదేవరపల్లి జిల్లా : హనుమకొండ

| క్ర. సం | సర్వే నెం. | భూమి రకం (ఖుష్కి/తరి) | భూమి విధం (పట్టా/ప్రభుత్వ/ఇనాం,మే) | భూసేకరణ చేయు విస్తీర్ణం (ఎకర ములలో) | పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా | అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా/ప్రస్తుతము మొఖాపై ఉన్నవారు | ఎంజాయ్‌మెంట్ ప్రకారం విస్తీర్ణము | ఇతర వివర ములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 583 | ఖుష్కి | ప్రభుత్వ | 0-18 | [illegible] | TGIIC | 0-18 | |
| 2 | 581 | ఖుష్కి | పట్టా | 2-32 | [illegible] | TGIIC | 2-32 | |
| 3 | 579 | ఖుష్కి | పట్టా | 1-25 | [illegible] | TGIIC | 1-25 | |
| 4 | 595 | ఖుష్కి | పట్టా | 3-33 | [illegible] | TGIIC | 3-33 | |
| 5 | 596 | ఖుష్కి | పట్టా | 4-00 | [illegible] | [illegible] | 0-25, 0-05, 0-16, 0-05, 0-05, 0-07, 0-02, 0-20, 1-00, 0-16, 0-10, 0-09 | |
| 6 | 600 | ఖుష్కి | పట్టా | 2-05 | [illegible] | [illegible]; సోలార్ పార్క్ | 0-02, 0-07, 1-36 | |
| 7 | 714 | ఖుష్కి | పట్టా | 0-02 | [illegible] | సోలార్ పార్క్ | 0-02 | |
| 8 | 713 | ఖుష్కి | పట్టా | 2-10 | [illegible] | సోలార్ పార్క్; [illegible] | 1-31, 0-08, 0-11 | |
| 9 | 712 | ఖుష్కి | పట్టా | 1-03 | [illegible] | [illegible] | 0-29 | |
| 10 | 710 | ఖుష్కి | పట్టా | 3-30 | [illegible] | [illegible] | 3-30 | |
| 11 | 699 | ఖుష్కి | పట్టా | 1-16 | [illegible] | [illegible] | 1-16 | |
| 12 | 698 | ఖుష్కి | పట్టా | 0-25 | [illegible] | సోలార్ పార్క్ | 0-25 | |
| 13 | 696 | ఖుష్కి | పట్టా | 1-29 | [illegible] | సోలార్ పార్క్; [illegible] | 0-09, 0-15, 0-26, 0-05, 0-04, 0-10 | |
| 14 | 678 | ఖుష్కి | పట్టా | 0-16 | [illegible] | [illegible] | 0-12, 0-04 | |
| 15 | 679 | ఖుష్కి | పట్టా | 2-00 | [illegible] | [illegible] | 0-08, 0-12, 0-16, 0-07, 0-14, 0-37 | |
| 16 | 682 | ఖుష్కి | పట్టా | 2-25 | [illegible] | [illegible] | 2-25 | |
| మొత్తం విస్తీర్ణం | | | | ఎ.30-29 గుంటలు | | | ఎ.30-29 గుంటలు | |

ఇట్టి ప్రకటన భూ సేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం-2013 (నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్-11(1) ప్రకారం సంబంధిత యాజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకుగాను ఇట్టి ప్రకటన జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, హనుమకొండ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హనుమకొండ గారి కార్యాలయములో లభ్యముగలదు. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ సమయములో తనిఖీ చేసుకోవచ్చును. జిల్లా కలెక్టర్, హనుమకొండ గారు భూసేకరణ అధికారి/రెవిన్యూ డివిజన్ అధికారి, హనుమకొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేయుటకు అనుమతించనైనది.

సదరు చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, సేకరణకు ప్రతిపాదించిన భూములందు జిల్లా కలెక్టర్, హనుమకొండగారి అనుమతి లేకుండా, ఇట్టి ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి కాలిరాలో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయనైనది.

ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములుగాని అభ్యంతరములు గాని ఉన్న యెడల పరిష్కారము కొరకు ప్రభావితమైన ప్రయోజనము గల వ్యక్తులందరూ, సదరు చట్టములోని సెక్షన్ (15) ననుసరించి ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేది నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, హనుమకొండగారికి/అధికృత అధికారిగారికి లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

సం/-, భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హనుమకొండ
సం/- అదనపు కలెక్టర్ హనుమకొండ
సం/-, జిల్లా కలెక్టర్, హనుమకొండ

DIPR RO.NO: 768/LA/PP/Advt/Pub/2024-25


## మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి స్వల్పఅస్వస్థత

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మార్చి 8, ప్రభాతవార్త:** అలుపెరుగకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ పని చేస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో జరిగిన బిఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశానికి వెళ్లి వస్తున్న క్రమంలో ఆమె అస్వస్థతకు గురికాగా నేరుగా నగరానికి వచ్చి ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు.

# ఐపిఎల్ టికెట్లపై సన్‌రైజర్స్ యాజమాన్యానిదే అధికారం

**వాటి అమ్మకాలకు, హెచ్‌సిఎకు ఏ సంబంధం ఉండదు**

**అసత్య ప్రచారాలతో అభిమానాలను ఆందోళనకు గురిచేయొద్దు**

**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అర్శనపల్లి జగన్మోహన్‌రావు**



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** ఐపిఎల్-2025కు సంబంధించిన మ్యాచ్ టికెట్లన్ని అమ్ముడుపోయాయని.. క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు బ్లాక్‌లో అమ్ము కోవడం వలనే ఇలా జరిగిందంటూ మీడియా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు (హెచ్ సిఎ) అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు స్పందించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ స్టేడియంలో మీడియాతో మాట్లాడుతూ ముంబైలో జరిగే మ్యాచ్‌కు టిక్కెట్లు అమ్ముడుపోతే హెచ్‌సిఎకు ఏం సంబంధమంటూ ఆయన మీడియాను ప్రశ్నించారు. హైదరాబాద్ మ్యాచ్ టిక్కెట్లను విక్రయించేది బుక్‌మైషోలో కాదని.. జొమాటోకి చెందిన డిస్ట్రిక్ యాప్‌లో అని తెలిపారు. సన్‌రైజర్స్ ఆడే తొలి రెండు మ్యాచ్‌ల టిక్కెట్లు ఇప్పటికే డిస్ట్రిక్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టికెట్ల విషయంలో మిడిమిడి జ్ఞానం, సమాచారంతో వార్తలు ప్రసారంచేసి అభిమానులను ఆందోళనకు గురిచేయవద్దని అన్నారు. అలాగే ఐపిఎల్ మ్యాచ్ టిక్కెట్లపై అధికారం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉంటుందని, హెచ్‌సిఎకు ఉండదని.. బిసిసిఐ, హెచ్‌సిఎ ఐపిఎల్ ఏర్పాట్లను పరిశీలిస్తుంది కానీ టిక్కెట్లు విక్రయించదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా హెచ్‌సిఎ ప్రతిష్టను మసకబారిస్తే ఉపేక్షించేది లేదు. దేశంలోనే హెచ్‌సిఎను ఒక రోల్ మోడల్‌గా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. ఐపిఎల్ టిక్కెట్ల దందా అని హెచ్‌సిఎపై తప్పుడు వార్తలు ప్రసారం చేసిన చానెళ్లకు లీగల్ నోటీసు లిస్తాం. కొందరిచ్చే తప్పుడు సమాచారంతో హెచ్‌సిఎపై బురదజల్లితే న్యాయపరంగా చర్యలు తీసుకొంటాం అంటూ జగన్‌మోహన్ వార్నింగ్ ఇచ్చారు. టిటిడి విడుదల చేసే రూ.300ల టిక్కెట్లు వెంటనే అయిపోతే ఇలానే వ్యవహరిస్తారా? తక్కువ ధర టిక్కెట్లను విద్యార్థులు, యువతలో ఎక్కువ డిమాండ్ ఉంటుంది కాబట్టి అవి త్వరగా విక్రయమవుతాయి. చివరగా టిక్కెట్ల విషయమై ఏమైనా అనుమానులుంటే సన్‌రైజర్స్ యాజమాన్యం, సిబ్బంది, డిస్ట్రిక్ట్ జొమాటో యాప్ ప్రతినిధులను సంప్రదించాలంటూ జగన్‌మోహన్‌రావు వివరించారు.

# కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అక్క చెల్లెల్లకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి మహిళా శక్తి ధీరత్వం, వీరత్వం, మాతృత్వం కలగిన ఒక ధృడమైన బలంగల మహిళా తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు మన మహిళలలేనని అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో మహిళా సాధికారత దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తుందన్నారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మీ ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కి గ్యాస్ సిలిండర్, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తిమిషన్-2025 ను కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

ఆర్‌టిసిలో మహిళా సమైక్య సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి ద్వారా బస్సులకు యజమానులను చేసి వారిలో ఆర్థిక వృద్ధి సాధించనున్నట్టు తెలిపారు. ఇటువంటి ఎన్నో పథకాలతో తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం మహిళా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన మాతృమూర్తికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్. మాతృమూర్తితోపాటు తన సతీమణిని సైతం మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సత్కరించారు.

# లింగవివక్షలేని సమాజ నిర్మాణంతోనే శీఘ్ర అభివృద్ధి

## సహకార శాఖ కమిషనర్ సురేంద్రమోహన్



**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** లింగ వివక్షలేని సమాజ నిర్మాణంతోనే శీఘ్రంగా అభివృద్ధి జరుగుతోందని మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తే వారు సబలలుగా నిరూపించుకొంటారని కోఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్, సహకార శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ అన్నారు.

శనివారం తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేంద్రమోహన్ మాట్లాడుతూ సహకార రంగంలో మహిళలు అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. వర్ధన్ కో ఆపరేటివ్ బ్యాంక్ సీనియర్ వైస్‌చైర్మన్ నిర్మలదాగా, ఆశ సతీష్‌క్షివసారా, నిర్మల బర్మిచా జైన్, అల్కాచౌదరి పాల్గొని మాట్లాడారు. బ్యాంకు మహిళా డైరెక్టర్లను సన్మానించారు. సమావేశంలో మహిళా దినోత్సం సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

# మధ్యవర్తిత్వంతో వైరుధ్యాలను పరిష్కరించుకోవచ్చు

**హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్**

**పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ తదితరులు**

**హనుమకొండ బ్యూరో, మార్చి 8, ప్రభాతవార్త:** సామాజిక వర్గ మధ్యవర్తిత్వ చట్టం ద్వారా సమూహాల మధ్య ఏర్పడ్డ విభేదాలు, వైరుధ్యాలను ప్రారంభ దశలోనే పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం వృధా కాకుండా, సమాజంలో సామరస్యాన్ని, శాంతిని కొనసాగించుకోవచ్చునని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యం లో జాతీయ లోక్‌అదాలత్, సామాజిక వర్గ మధ్యవర్తిత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ముఖ్య అతిథిగా హాజరు కాగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్, రెండు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రమేష్ బాబు, విబి నిర్మలాగీతాంబ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్, సామాజిక వర్గ మధ్యవర్తిత్వ చట్టంపై రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ప్రసంగిస్తూ చిన్న చిన్న తగదాలకు కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగకుండా కుల పెద్దలను సంప్రదించవలసిన రోజులు రావాలని కోరారు. పూర్వపు రోజులలో సామాజిక వర్గ పెద్దల సమక్షంలోనే సమూహాల మధ్య నెలకొన్న విభేదాలు, వైరుధ్యాలను పరిష్కరించుకునే వారని పేర్కొన్నారు. సమాజంలో చిన్నచిన్న సమస్యలు తలెత్తిన కోర్టులను, పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్నారని, అలాంటివి కింది స్థాయిలోనే పరిష్కరించుకుంటే మేలు అని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక వర్గ మధ్యవర్తిత్వం ద్వారా ఎన్నో కేసులను, తగాదాలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఆ రాష్ట్రంలోని మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా సామాజిక వర్గ మధ్యవర్తిత్వం ద్వారా వైరుధ్యాల పరిష్కారానికి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తమ చుట్టూ ఉన్న సమూహాలలో నెలకొనే విభేదాలు, వైరుధ్యాలను పరిష్కరించేందుకు ఔత్సాహికులు సామాజిక వర్గ మధ్యవర్తిత్వం వాలంటీర్లుగా సేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. శనివారం కాళోజీ కళాక్షేత్రం హనుమకొండలో జరిగిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌పై అవగాహన కార్యక్రమంలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ హాజరై మాట్లాడుతూ 'కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రంలో మధ్యవర్తులుగా ఉన్న కుల పెద్దలు శిక్షణ పొందిన వారై ఉంటారు కనుక ఇరుపక్షాలకు పరస్పర ఆమోద యోగ్యమైన రీతిలో వివాదాన్ని పరిష్కరించు కోవడానికి వీలుంటుంది. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కార్యక్రమం ప్రతి జిల్లాలో ప్రతి గ్రామాలలో అమలు చేయబడుతుంది. దీనిద్వారా ప్రజలకు మేలు కలుగుతుందని ఆశిస్తున్నాం. సామూహిక మధ్యవర్తిత్వ కేంద్ర మధ్యవర్తులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పక్షపాత వైఖరి చూపించకుండా న్యాయబద్ధంగా వివాదాలను పరిష్కరిస్తారు అని తెలిపారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రంలో మధ్యవర్తులుగా పనిచేయుటకు వరంగల్ జిల్లా నుండి అన్ని కులాల పెద్దలు, అనుభవస్తులు అధిక సంఖ్యలో ఇంట్రస్ట్ చూపినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి కె.లక్ష్మణ్ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. రమేష్‌బాబు, మెంబర్ సెక్రెటరీ సి.హెచ్. పంచాక్షరి, వరంగల్, హనుమకొండ, ములుగు, జనగాం, మహబూబా బాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్ లు డాక్టర్ సత్యశారద, పి.ప్రావీణ్య బార్ కౌన్సిల్ మెంబర్ సిరికొండ సంజీవరావు, వివిధ కుల సంఘాలపెద్దలు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల్లో గోడ గడియారం ఏర్పాటు చేయాలి

**సిఎస్, డిఒలకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య ఆదేశం**

**ఒక్కో గడియారానికి రూ. 1,000 మంజూరు**

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వార్షిక పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షా కేంద్రంలో టైమ్ తెలుసుకోవడానికి ఇకపై తంటాలు పడాల్సిన అవసరం లేదు. రాష్ట్రం లో పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల్లో ప్రతి గదిలోనూ గోడ గడియారం ఏర్పాటు చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ఒక్కో గడియారానికి రూ. 1000 మంజూరు చేస్తున్నట్టు సిఎస్, డిఒ లకు తెలిపారు. సోమవారం పరీక్ష ప్రారంభమయ్యే నాటికే పరీక్షలు జరిగే అన్ని గదుల్లోనూ గోడ గడియారాలను ఏర్పాటు చేయాలని బోర్డు కార్యదర్శి ఆదేశించారు. గడియారాలను ఏర్పాటు చేసి వాటికి సంబంధించిన ఫోటోలను ఇంటర్ బోర్డుకి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రం లో 1,532 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. వాటిలో ఒక్కో పరీక్షా కేంద్రంలో కనీసం 5 గదులకు తక్కువ కాకుండా.. 12 గదులకు మించకుండా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల్లోని అన్ని గదుల్లోనూ గోడ గడియారాలను ఏర్పాటు చేయడానికి సుమారు రూ. కోటి వరకు ఖర్చు చేయనునున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 5 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి మొదటి సంవత్సరం వారికి రెండు పరీక్షలు, సెకండియర్ వారికి ఒక పరీక్ష పూర్తి కాగా.. మిగిలిన పరీక్షలు జరగాల్సి ఉన్నాయి. సోమవారం ఇంటర్ సెకండియర్ వారికి ఇంగ్లీష్ పేపర్-2 పరీక్ష జరగనుంది. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 25 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. 9,96,971 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వారిలో 4,88,448 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు ఉండగా.. 5,08,523 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులున్నారు. 861 ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో.. 642 ప్రభుత్వ, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో, మరో 29 కేంద్రాలను స్కూల్స్ ఇతర వాటిల్లో ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 1532 మంది సిఎస్, డిఓలను నియమించగా.. 29,992 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 72 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను, 124 మంది సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.

నీటిని ఎక్కడికక్కడ ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచితే నది జలాల వాడకం తగ్గిపోతుంది. దేశవ్యాప్తంగా పెద్దప్రాజెక్టులు కట్టాలి. ఎన్నికల వ్యయాలు కోసం నిధులు పోగుచేసుకోవాలనే రాజకీయ నాయకుల ఆ కాంక్షతో జలవివాదాలు పెరుగుతున్నాయి. దేశంలో బనకచర్ల ప్రాజెక్టుతో పాటు మరో ఏడువివాదస్పద అంతర్రాష్ట్ర ప్రాజెక్టులు ఉన్నాయి. కావేరినదిపై తమిళనాడులో హొగెనక్కల్, పెరియార్ నదిపై కేరళలో ముళ్ళపెరియార్, పోలార్‌నదిపై తమిళనాడులో పోలార్‌ప్రాజెక్టు, వంశధారపై ఆంధ్రప్రదేశ్‌లో వంశధారప్రాజెక్టు, గోదావరిపై మహారాష్ట్రలో బాబ్లీప్రాజెక్టు, తుంగభద్రపై కర్ణాటకలో తుంగభద్రప్రాజెక్టు, కృష్ణా నదిపై కర్ణాటకలో ఆలమట్టి వంటివి వివాదాస్పదమైన ప్రాజెక్టులున్నాయి. 1969లో మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒడిశా, మధ్యప్రదేశ్‌ల మధ్య జలవివాదం పరిష్కారం కోసం గోదావరి నదిజలాల వివాదట్రిబ్యునల్ బచావత్ చైర్మన్‌గా ఏర్పాటుచేశారు. 1969లోనే మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా కృష్ణా జలవివాదల పరిష్కారం కోసం 'కృష్ణా ట్రిబ్యునల్ బచావత్ అధ్యక్షతన వేశారు. 1969లో రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మధ్య నీటివివాదం కోసం నర్మదా జలాల వివాదాలట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. 1986లో రావి, బియాస్ జలవివాదల ట్రిబ్యునల్ ఏర్పాటుచేశారు. రాజస్థాన్, హరియాణా, పంజాబ్ మధ్యనీటి వివాదంపరిష్కారం చేయడానికి వేశారు. 1990 లో కావేరి జలవివాదల ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. 2004లో బ్రిజేష్‌కుమార్ చైర్మన్‌గా కెడబ్ల్యు డిటి-2 వేశారు. ఇందులో కొత్తగా తెలంగాణ రాష్ట్రం చేర్చినారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉంది. తాజాగా తెలంగాణ రాష్ట్రం ఎపి రీ ఆర్గనైజషన్ చట్టం సెక్షన్ 89 ప్రకారం కాకుండా నదిజలాల చట్టం 1956 సెక్షన్3 ప్రకారం నీటి వాటాలు తేల్చాలని ఒత్తిడి చేస్తుండటంతో సాగదీత మొదలైంది.

# జలవివాదంలో ఓటు బ్యాంకు 'రాజకీయం'!

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

'బీళ్ల నింపే నీళ్ళున్న సముద్రన పడిపోయే శాపం తన కెందనని- బరువై దయకరువై తను వెలియై ఇక బలియై -ఉప్పు సాగరాలలోకి వెళ్లలేక వెక్కివెక్కి పడుతున్నది ఆ అలల అలజడి ఆ తడి ఆరని కంటితడి కనపడలేదా వినపడలేదా' సుద్దాల అశోక్ తేజ నదిలో పరకాయ ప్రవేశించి వేసినప్రశ్నను, ప్రజలు అందిపుచ్చుకొని జలవివాదాలు పరిష్కరించే ట్రిబ్యునల్స్ కు, కేంద్రప్రభుత్వానికి ప్రశ్నవేసి నిలదీయాలి. నైరుతి రుతుపవనాలు తగ్గినప్పుడల్లా దేశంలో జలవివాదాలు రాష్ట్రాల మధ్య తలెత్తుతోన్నది. భారతదేశంలోని నదుల్లో 85శాతం అంతరాష్ట్ర విభాగానికి చెందిన నదులు ఉన్నాయి. ఆ నదీజలాల పంపకంపై అనేక వివాదాలు తలెత్తుతున్నాయి. రాజకీయనాయకులు వాటిని ఓటు బ్యాంకు రాజకీయాలుగా మలుచుకొని లబ్ధిపొందుతున్నారు. జలవివాదాల ట్రిబ్యునళ్ల విచారణలు సుదీర్ఘకాలం సాగుతుండటంతో వివాదాల పరిష్కారం తీవ్ర జాప్యం జరుగుతోంది. అంతరాష్ట్ర నదిజలాల సమస్యలు మనదేశ సమాఖ్య విధానానికి ప్రతిబంధకంగా మారుతోన్నది. దక్షిణ భారతదేశంలో గోదావరి, కృష్ణా, కావేరినదులు నిత్యం వివాదాలకు కేంద్రబిందువులు మారినాయి. ఉత్తరాదిన రావి బియాస్, నర్మదా వివాదాలపై ట్రిబ్యునల్ దృష్టి సారించాయి. తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ వివాదం తరుచుగా తలెత్తుతుంది. కావేరి జలవివాదం తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మధ్య కావేరినది నీటి వనరుల పంపిణీపై చాలా కాలంగా కొనసాగుతున్న వివాదం. కావేరి నది దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల గుండా ప్రవహించే ఒక ప్రధాన నది. ఇది ఈరాష్ట్రాల ప్రజలకు జీవనాడి, తాగునీరు, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి నీటిని అందిస్తుంది. 2023లో కావేరి జలవివాదం తలెత్తడంతో తమిళనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించి, తమ పంటలకు మద్దతుగా ప్రతి రోజూ సెకనుకు 24,000 క్యూసెక్కుల కావేరీ నీటిని విడుదల చేయాలని కర్ణాటకను కోరింది. దీనికి ప్రతిస్పందనగా, కోర్టు కర్ణాటకను 15 రోజుల పాటు తమిళనాడుకు 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. ఆ రెండు రాష్ట్రాలు ఎవరికి వారు కావేరి నది నీటిలో ఎక్కువవాటాను డిమాండ్ చేస్తున్నాయి. ఈ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. తరచుగా నిరసనలు, హింసకు దారి తీసింది. ఈ వివాదంపై లోతైన అధ్యయనం ఇక్కడ ఉంది. కృష్ణానది జలాల ట్రిబ్యునల్ తీర్పుప్రకారం కర్ణాటక ప్రభుత్వం లాల్ బహదూర్ శాస్త్రీ ఆలమట్టి డ్యామ్ ఎత్తును 519 మీటర్ల నుంచి 524.26 మీటర్లకు పెంచి ఎగువ కృష్ణా-3లో ఎక్కువ నీటిని వినియోగించుకోవాలనే ప్రతిపాదన ఉమ్మడిఆంధ్రప్రదేశ్ పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. కృష్ణానది జలాల పంపిణీ కోసం బచావత్ ట్రిబ్యునల్ కాలపరిమితి ముగియడంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి



ఆంధ్రప్రదేశ్‌లకు నీటిని పంపిణీచేస్తూ అవార్డు ప్రకటించింది. గోదావరి జలాల వివాదం పరిష్కారం కోసం 1962లో కేంద్రంకు అభ్యర్థనలు వెళ్లాయి. దేశంలోనే తొలి అంతరాష్ట్ర జలవివాదాల ట్రిబ్యునల్‌ను 1969లో ఆర్ఎస్‌బచావత్ అధ్యక్షతన కృష్ణాజలాల వివాదాల పరిష్కారంకు ఏర్పాటుచేశారు. కర్ణాటక, మహారాష్ట్రా, ఆంధ్రప్రదేశ్ దీని పరిధిలోని రాష్ట్రాలు ఉన్నాయి. 1973లో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకటించారు. కావేరి జల వివాదంలో 1990లో ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తే2007లో తుదితీర్పు వచ్చింది. గోదావరి నదికి సంబంధించిన అంతర్‌రాష్ట్ర జల వివాదాల తీర్పు కోసం జస్టిస్ బచావత్ నేతృత్వంలోని గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్‌ను ప్రభుత్వం ఏప్రిల్ 1969లో ఏర్పాటుచేసింది. తీర్పు ప్రక్రియలు కొనసాగుతున్నపుడే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, కర్ణాటక మధ్య 1975 సంవత్సరంలో అనేక అంతర్‌రాష్ట్ర ఒప్పందాలు కుదిరాయి. తదనంతరం, 1978-79 సంవత్సరంలో నీటిపారుదల ప్రాజెక్టుల సంఖ్యకు సంబంధించి పార్టీ రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక త్రైపాక్షిక ఒప్పందాలు కూడా జరిగాయి. ట్రిబ్యునల్ ఈ ఒప్పందాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంది. గోదావరి పరివాహక రాష్ట్రాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని వాటిని తుది అవార్డులో చేర్చింది. మహారాష్ట్ర పైథాన్‌వరకు గోదావరిలో ప్రవాహాన్ని ఉపయోగించుకోవచ్చు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పైథాన్ దిగువన ఉన్న గోదావరి ప్రవాహాలను ఉపయోగించుకోవచ్చు. అదేవిధంగా, ద్వైపాక్షిక ఒప్పందాలు గోదావరి ఉపనదుల నీటిని పంచుకోవడానికి కూడా అనుమతిస్తాయి. ఈ ఒప్పందం ఇంచంపల్లి, పోలవరం వంటి అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతి ఇచ్చేవిధంగా ట్రిబ్యునల్ 1980జూలైలో తనఅవార్డును ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టు ఒప్పందం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నుండి 80 టిఎంసి గోదావరి నీటిని విజయవాడ ఆనకట్ట ఎగువన ఉన్న కృష్ణానదికి మళ్లించవచ్చు. ఈ విధంగా కృష్ణాలో మళ్లించబడే నీటిని ఈక్రింది విధంగా పంచుకుంటారు. ఆంధ్రప్రదేశ్ 45 టిఎంసి కర్ణాటక, మహారాష్ట్ర 35 టిఎంసి ఇంచంపల్లి బహుళార్థ సాధక ప్రాజెక్టు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి వెంచర్‌గా ఉంటుంది. ఇది త్రైపాక్షిక అంతర్‌రాష్ట్ర నియంత్రణ బోర్డు ఆదేశాల ప్రకారం అమలు చేయబడటంతో పాటు నిర్వహించబడుతుందని గోదావరి నదిపై ట్రిబ్యునల్ దిశ నిర్దేశించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిడబ్లుసికి ఏ మాత్రం తెలుపకుండానే మహారాష్ట్ర గైక్వార్డ్ ప్రాజెక్టు నుంచి బాబ్లీ వరకు లెక్కకు మిక్కిలి ప్రాజెక్టులు గోదావరిపై నిర్మించి సుమారు 300టిఎంసిల నీరును చెరబట్టడంతో వివాదం చెలరేగింది. ఎస్సారెస్పి శిఖంలోనే బాబ్లీ ప్రాజెక్టును నిర్మించడంతో ఉమ్మడి ఎపికి మహారాష్ట్రకు మధ్యయుద్ధమే నడిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుఅనంతరం మహారాష్ట్రతో సయోధ్య కోసం తెలంగాణ యత్నించినా తుమ్మడిహట్టివద్ద ఎత్తు తగ్గించుకొని ప్రాణహితపై రిజర్వాయర్ నిర్మించుకోవాలని మహారాష్ట్ర షరతు విధించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు నదీజలాల వివాదాలు వేదికలుగా మారుతున్నాయి. నీటి వివాదాలు పరిష్కారంకు పటిష్టమైన పారదర్శకమైన విధానంతో పాటు సమాఖ్య స్ఫూర్తితో విశాల ధృక్పథంతో ముందుకు పోవాలి. కర్ణాటకలో కేంద్రంలో ఒకే పార్టీ పాలన ఉన్నప్పుడు తమిళనాడు ఇబ్బందిపెట్టేలా చర్యలు తీసుకోవడం. ఒకవేళ కర్ణాటకలో ఒక పార్టీ, కేంద్రంలో ఒక పార్టీ ఉన్నప్పుడు అదే కావేరి వివాదంను మరోకోణంలో చూడటం మానకోవాల్సిన అవసరం ఉంది. ట్రిబ్యునల్ తీర్పులలో పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాలు అన్యాయం జరిగిందని ఆర్టికల్ 136, ఆర్టికల్32, ఆర్టికల్21 అనుసరించి చీటికి మాటికి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారు. నీళ్లకు రాజకీయాలకు బంధం పెరుగుతుండటంతో భారత దేశంలో రాష్ట్రాలమధ్య యుద్ధ వాతావరణం నెలకొంటున్నది. ఐక్యరాజ్య సమితి మాజీ సెక్రటరీజనరల్ బ్రైత్రోస్ ఘలి చేసిన హెచ్చరికలు మన పాలకులు పరిగణలోకి తీసుకొని అంతరాష్ట్ర నదీజాలల పరిష్కారంకు ఒకే శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వివాదాలను తగ్గించాల్సిన అవసరం ఉంది. కేంద్రం ఒక్కటి కూడా ఈ వివాదాన్ని పరిష్కరించలేదు. ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం నదిజలాలవరదలను ఖచ్చితంగా అంచనావేసి ప్రాంతీయంగా ఉండే అవసరాలనుతీర్చడానికి పెద్దమనస్సుతో వ్యవహరించాలి. నదీజలాల సమస్య పెరిగిపెరిగి జాతీయసమస్యగా మారే అవకాశం ఉంది. కృష్ణానది నుంచి సముద్రంలో వృథాగా కలిసేనీటిని బనకచర్లద్వారా కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమకు తరలిస్తామని చంద్రబాబు 200టిఎంసి ప్రాజెక్టును ప్రతిపాదించడంతో తెలంగాణ వ్యతిరేకించింది. అంతరాష్ట్ర నదిపై ఒక రాష్ట్రం ప్రాజెక్టు నిర్మించి, అభివృద్ధి చేయడంవల్లే నది పరివాహాకంలో ఉన్న ఇతర రాష్ట్రాలు తమ ప్రయోజనాలకు భంగం కలుగుతుందనే భావనతో వివాదంకు ఆజ్యం పోస్తున్నాయి. కేంద్రం కూడా నదీ జలాల చట్టం 1956ద్వారా పరిష్కారం కోసం చొరవచూపడం లేదు. అంతర్రాష్ట్ర నదిజలాల చట్టం 2019అనేక సవరణలలో అదే సంవత్సరం జులై 25 చట్టసభల్లో పెట్టినది నది వివాదాల పరిష్కారంకు దోహదం చేసేలా ఉన్నప్పటికి ఆయా రాష్ట్రా మధ్య ఒప్పందాలు, పరిష్కారాలను చేయడానికి సవరణలు ఇంకా ఇందులో చేయాల్సినవి ఉన్నవి.

ఉత్తరప్రదేశ్

# 'మాయా' వైరాగ్యం!

**ఎ.వి.వి ప్రసాద్**

ఒకప్పుడు దేశ రాజకీయాలలో ఓ వెలుగు వెలిగిన బిఎస్‌పి అధినేత్రి మాయావతి రానురాను మరింత చీకటివైపు పయనిస్తున్నారా? ఆమె ఇటీవల తీసుకొన్న కొన్ని నిర్ణయాలు, చేసిన ప్రకటనలు అదే సందేహాన్ని కలిగిస్తున్నాయి. రాజకీయ పవనాలు దిశ మార్చుకొని సాగుతుండగా, ఆమె ఆవాలు వైపు పయనించలేకపోతున్నారో! లేక పయనించడానికి సుముఖంగా లేరో చెప్పలేం కానీ ఆమె పూర్తిగా వెనుకబడిపోయారని మాత్రం చెప్పగలం. ముఖ్యంగా 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత మోడీ ప్రభంజనం మొదలైన తర్వాత దేశంలోని చాలామంది 'నం-1' రాజకీయ నేతల భవిష్యత్తు కూడా మారిపోయింది. కొంత మంది పూర్తిగా వెనక్కి వాలగా, కొందరు పడుతూ, లేస్తూ ఏదో ఒక అధికారం పట్టుకొని వేలాడుతున్నారు. మొదటి వర్గంలో మాయావతి ముఖ్యురాలైతే, రెండోవర్గంలో ప్రధానంగా నితీశ్ కుమార్‌ను చెప్పుకోవచ్చు. ఎట్టి పరిస్థితులలోనూ రాజీపడకుండా, నమ్మిన సిద్ధాంతాలకు తిలోదకాలివ్వకుండా నడుస్తున్నందువల్లనే మాయావతి వెనుకబడ్డారనే అభిప్రాయంకూడా చాలామందిలో ఉంది. గతవారం ఆమె తీసుకొన్న కొన్ని నిర్ణయాలు కూడా ఆకోవకు చెందినవే. తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను అన్ని కీలక పదవులనుంచి తొలగించడమేకాక, మరుసటి రోజునే ఆయనను పార్టీ నుంచి కూడా బహిష్కరించారు. ఈ చర్య పార్టీలో ప్రకంపనలు పుట్టిస్తోంది. గతఆదివారం (2, మార్చి) లక్నోలో జరిగిన పార్టీజాతీయ స్థాయి సమావేశంలో ఆమె మరికొన్ని సంచలన నిర్ణయాలు కూడా తీసుకొన్నారు. తాను బతికి ఉన్నంత కాలం వారసునిగా ఇక ఎవరి పేరును ప్రకటించబోనని కూడా స్పష్టం చేశారు. తన సోదరుడు ఆనంద్ కుమార్, రామ్‌జీ గౌతమ్ ఇకపార్టీ జాతీయ సమన్వయకర్తలుగా ఉంటారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణపై ఆకాష్‌మామ అశోక్ సిద్ధార్థను గతనెలలో ఇదేవిధంగా బిఎస్‌పి నుంచి బహిష్కరించారు. అప్పుడే అందరికి అనుమానం కలిగింది. ఇంకా ఏదో జరగబోతోందని, గతంలో తనకు అత్యంత విశ్వాసపాత్రునిగా ప్రకటించి, తనవారసుడు అతడే అని చెప్పి ఆకాష్ ఆనంద్‌కు చాలా పెద్దపీటవేసిన మాయావతి ఇప్పుడు హఠాత్తుగా అతడిని పీటపై నుంచి తోసేయడానికి కారణం ఏమై ఉంటుందనే ఆలోచనలో పార్టీకార్యకర్తలు సతమతమవుతున్నారు. 2023లో మాయావతి తనవారసుడిగా 30యేళ్ల ఆకాష్‌ను ప్రకటించారు. కొద్దికాలంలోనే అతడిపై అనేకానేక ఆరోపణలు రావడంతో ఆహోదానుంచి ఆకాష్‌ను తొలగించి గతసంవత్సరం తిరిగి నియమించారు. ఇప్పుడు మళ్లీ తొలగించడమేగాక పార్టీ నుండి కూడా బహిష్కరించారు. అయితే ఇక్కడే కథ కొత్తమలుపు తిరిగింది. మాయావతి తర్వాత ఆకాషే అధినాయకుడని ప్రచారం జరుగుతున్న సమయంలో అతడిని తొలగించి భవిష్యత్తులో తన వారసునిగా ఎవరినీ ప్రకటించబోనని మాయావతి అనడంలో పార్టీలోని మిగిలిన నేతలు, కార్యకర్తలు ఇప్పుడు అయోమయంలో పడ్డారు.



మాయావతి

ఇండియాకు కాబోయే 'దళిత పిఎం'గా ఆమె విషయంలో గతంలో బాగాప్రచారం జరిగింది. దేశంలో మహిళలు ముఖ్యమంత్రులై, ప్రధాని పీఠంవైపు పరుగులు పెట్టిన వారిలో ఆమె కూడా ఒకరు. మరో ఇద్దరు జయలలిత, మమతాబెనర్జీ. ఈ ముగ్గురికి ఏదోవిధంగా పిఎం కావాలనే కాంక్ష బలంగాఉండేది. (మమతకు ఇప్పటికీ ఉంది) మాయావతి చాలా దగ్గరగా వెళ్లారు. కానీ పీఠాన్ని చేరలేకపోయారు. జయలలిత జాతీయస్థాయికి ఎదగడానికి ఎనలేనికృషి చేసినా ముఖ్యమంత్రిగానే తనువు చాలించారు. మోడీ పవనాలు బలహీనపడితే ఎలాగైనా పిఎం పదవి అధిష్టించాలనే తపనతో మమతా బెనర్జీ కనిపిస్తున్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఆమె కదలికలన్నీ ఆ దిశలోనే సాగుతున్నాయి. 1984లో కాన్షీరాం బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి)ని స్థాపించిన తర్వాత దళితులు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనార్టీలకు చేయి అందిస్తూపార్టీని ఉన్నతస్థితికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు రాజకీయ వారసత్వంలో ఉన్నత స్థాయికి చేరుకోవడాన్ని వ్యతిరేకిస్తూ స్కూలు టీచర్‌గా ఉన్న మాయావతికి ఆ అరుదైన అవకాశంకల్పించారు. ఫైర్‌బ్రాండ్ నాయకురాలిగా రాజకీయాల్లో ప్రారంభంలోనే సంచలనం సృష్టించిన ఆమె నాలుగుసార్లు ముఖ్యమంత్రి పీఠం అధిష్టించారు. ఆమె అధికారంలో ఉన్నకాలం కూడా ఓ సంచలనమే. ప్రశంసలు, విమర్శలు కూడా ఎక్కువేవచ్చాయి. అధికారంలో ఉన్నప్పుడే వారసుని ఎంచుకొని బహిరంగంగానే ప్రకటించడమే గాక, తన ఆత్మకథలోకూడా అతడి గురించిచాలా సానుకూల అభిప్రాయాలు ప్రకటించారు. 2019 జూన్‌లో ఆకాష్‌ను బిఎస్‌పి జాతీయ సమన్వయ కర్తగా నియమించి తన తర్వాత అతడే 'ఉత్తరాధిపతి' అన్నట్లు ప్రకటనలు చేశారు. అయితే అప్పట్లోనే ఆకాష్‌కు వ్యతిరేకంగా కూడా పార్టీలో చాలామంది మాట్లాడారు. పార్టీలో ఎందరో సమర్థులైన నేతలు, కాన్షీరాం అనుచరులుండగా రాజకీయ ఓనమాలు పూర్తిగా ఎరుగని కుర్రాడికి వారసత్వబాధ్యతలు అప్పగించడమేమిటని బాహాటంగానే చాలామంది ప్రశ్నించారు. అయితే మాయావతి ఒకనిర్ణయం తీసుకొంటే అది మళ్లీ మారదు గనుక, ఎవరేమనుకున్నా అతడే తన వారసుడని చాలా సందర్భాలలో ఆమెనొక్కిచెప్పారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు హఠాత్తుగా తొలగించిపార్టీతో ఇక ఎలాంటి సంబంధం లేకుండా బహిష్కరించారు. దీనివెనుక ప్రధానకారణం ఇటీవలపార్టీ నిధులలో చాలా గోల్‌మాల్ జరగడమేనని చెప్పుకొంటున్నారు. అతడి బహిష్కరణ ప్రభావం యువ కేడర్‌పై ఎక్కువే పడవచ్చు. 2007లో 30.43 శాతంగా ఉన్న బిఎస్పీ ఓట్లశాతం2024లోక్‌సభ ఎన్నికల నాటికి 9.39శాతానికి పడిపోయిందంటే పార్టీ ఎంత త్వరగా ఉనికిని కోల్పోతున్నదో అర్థమవుతుంది. ఇంకా మాయావతి పోస్టర్లు వేసి విజయం సాధించే స్థితిలో బిఎస్పీ లేదు గనుక వారసుని ఎంపికవిషయంలో ఆమె సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. మాయావతి దగ్గరే బిఎస్పీ ఆగిపోకూడదు కదా!

అమెరికా

# గవర్నర్ రేసులో కమల

**గన్ని మోహన్**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి రిపబ్లికన్ అభ్యర్థిగా గెలిచిన డొనాల్డ్‌ట్రంప్‌కు అడుగడుగునా గట్టి పోటీ ఇచ్చిన మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఎన్నికల్లో ఓటమి తర్వాత కొంతకాలం మౌనంగానే ఉండిపోయారు. ఇప్పుడు మళ్లీక్రియాశీలక రాజకీయాల్లోకి రావాలన్న నిర్ణయానికి వచ్చినట్లు ఇటీవలి కాలంలో ఆమె పాల్గొంటున్న కార్యక్రమాలు ఇందుకు ఊతంఇస్తున్నాయి. డెమొక్రాట్ల తరపున గెలిచి జోబైడెన్ హయాంలో అమెరికా ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన కమలా హ్యారిస్ గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చివరివరకూ రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌నకు గట్టిపోటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. చివరి నిమిషంలో ట్రంప్‌నకు మద్దతు పెరగడంతో కమలా ఓటమి ఖరారైంది. ఎన్నికల్లో ట్రంప్ 312ఎలక్టోరల్ ఓట్లు గెలుచుకోగా కమలా హారిస్‌కు 226 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీనితో ఓటమి చవిచూసిన తర్వాత ఆమె సుదీర్ఘంగా ఉన్న మౌనం వీడారు. కొన్నిసార్లు సానుకూల ఫలితాలకు కొంతమేర వ్యవధి పడుతుందని, అంతమాత్రాన గెలవలేమని భావించకూడదని చెపుతూ స్వేచ్ఛ, న్యాయం, భవిష్యత్తు కోసం మళ్లీపోటీకి రావాల్సిందేనన్న వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. ఎన్నికల్లో పరాజయం తర్వాత కూడా కమలాఅనేక కార్యక్రమాలకు హాజరయ్యారు. అవుతూవస్తున్నారు. తాజాగా తాను కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధంఅవుతున్నట్లు సూచనప్రాయంగా ప్రకటించరు. ఈవేసవిలోనే తాను ఈరేసులోకి రావడంపై తుదినిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ప్రస్తుతం కాలిఫోర్నియా గవర్నర్‌గా గావిన్‌న్యూసమ్ కొనసాగుతున్నారు. కమలా హారిస్ కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేయాలనుకోవడానికి ప్రధాన కారణం కూడా లేకపోలేదు. దశాబ్దాలుగా ఈరాష్ట్ర ప్రజలు ఓటర్లు డెమొక్రాట్లనే బలపరుస్తూ వస్తున్నారు. ఇదేరేసులోకి ఇప్పుడు కమలా హారిస్ వస్తే ఖచ్చితంగా విజయం ఆమెను వరిస్తుందన్న నమ్మకంతోనే ఆమె పోటీకి దిగుతున్నట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో పరాజయం తర్వాత మళ్లీ 2028 ఎన్నికల్లో తాను పోటీచేయకూడదని కూడా నిర్ణయించుకున్న కమలా హారిస్ కాలిఫోర్నియా గవర్నర్‌రేసులో మాత్రం ముందున్నారు. తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడంకోసం మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలనే హ్యారిస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2026 వరకూ ప్రస్తుత గవర్నర్ గావిన్ న్యూసమ్ పదవీకాలం ఉంది. అనంతరం ఎన్నికలకు రావాల్సి ఉంటుంది. ప్రస్తుత గవర్నర్ స్థానంభర్తీచేసేందుకు సరైన అభ్యర్థి అంటూ ఎవరూలేరు. అందువల్లనే కమలా హ్యారిస్ రంగంలోకి వచ్చినట్లుతెలుస్తోంది. దీనికి తోడు కాలిఫోర్నియాలో ఆమెకు మంచి పేరు ఉంది. ఎమర్సన్ కళాశాల పోలింగ్, ఇన్‌సైడ్ కాలిఫోర్నియా పాలిటిక్స్, ది హిల్ సంస్థలు గతనెల పది 11తేదీల్లో వెయ్యి మందికిపైగా కాలిఫోర్నియా ఓటర్లను సర్వేచేస్తే సుమారు పదిమందిలో ఆరుగురు కమలాకే మద్దతుపలికారు. ప్రైమరీఓటర్లు 57శాతం కమలా హ్యారిస్ పట్ల ఆసక్తిచూపించారు. మాజీ ప్రతినిధి కేటీ పోర్టర్ తొమ్మిదిశాతం మద్దతుసాధించారు. మాజీ కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీస్పీకర్ ఆంటోనియా విల్లారాయిగోసాకు, ప్రస్తుత లెఫ్టినెంట్ గవర్నర్ ఎలిని కౌనాలాకిస్‌లకు నాలుగుశాతం చొప్పున మాత్రమే మద్దతు లభించింది. 17శాతం మంది ఓటర్లు ఎటూ చెప్పలేకపోయారు. ఒకవేళకమలా హ్యారిస్ పోటీలోకి రాకుండా మాజీ సెనేటర్ పోర్టర్‌కు మద్దతు 21శాతం వరకూ ఉంటుంది. ఆ తర్వాత విల్లారైగోసాకు 9శాతం, కైనాలాకిస్‌కు ఐదుశాతం చొప్పున పెరుగుతుందని 45శాతం డెమొక్రటిక్ ప్రైమరీ ఓటర్లు మాత్రం ఎటూ నిర్ణయించలేకపోయినట్లు సర్వేలు వెల్లడించాయి. ఈ సర్వే ఫలితాలన్నింటినీ బేరీజు వేసుకున్న తర్వాతనే కమలా హ్యారిస్ ఇప్పుడుకాలిఫోర్నియా గవర్నర్ రేసులోకి వచ్చినట్లు అవగతం అవుతోంది. యుసి బర్కిలీ, లాస్ ఏంజెల్స్ టైమ్స్ గత ఏడాది అక్టోబరులో నిర్వహించిన సర్వేలను



కమలా హ్యారిస్

చూస్తే హ్యారిస్‌కు గణనీయంగా మద్దతు లభించింది. 72శాతం మంది డెమొక్రాటిక్ ఓటర్లు తాము కమలాహారిస్‌కే మద్దతిస్తామని చెప్పారు. 8 శాతం రిబిప్లకన్లు, 38శాతం ఓటర్లు మాత్రం ఏ పార్టీకి ప్రాధాన్యత నివ్వలేదు. కాపిటల్ వీక్లీ పోల్ సర్వే ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేను చూస్తే కాలిఫోర్నియా మొత్తంగా కమలా హ్యారిస్‌కే మద్దతునిచ్చారు. మొత్తం ఓటర్లలో 23శాతం ఆమెకే మద్దతిస్తే 21శాతం రిపబ్లికన్ బిజినెస్ మాన్ జాన్ కాక్స్‌కు మద్దతిచ్చారు. పోర్టర్‌కు 16శాతం, మాజీ రిపబ్లికన్ అభ్యర్థి లాన్‌హీచెన్ పదిశాతం మద్దతుసాధించారు. ఇప్పటివరకూ ఉన్న రాజకీయ పరిణామాలను చూస్తే సుమారు ఆరుగురు అభ్యర్థులు తాము గవర్నర్ రేసులో ఉన్నట్లు అధికారికంగానే ప్రకటించారు. వారిలో లాస్‌ఏంజెల్స్ మాజీ మేయర్ ఆంటోనియో వల్లారైగోసా, మాజీ స్పీకర్ టోని అట్కిన్స్, ప్రస్తుత ఎల్జీ ఎలెనీ కౌనాలాకిస్‌లు కమలాకు పోటీగా కనిపిస్తున్నారు. మాజీప్రభుత్వ కంట్రోలర్ బెట్టీయీ, కాలిఫోర్నియా పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ పర్యవేక్షకులు టోనీ థర్మాండ్‌లుకూడా పోటీ చేస్తామని చెపుతున్నారు. కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా ఇప్పటికే కమలా హ్యారిస్‌ను ఎండార్స్ చేస్తూ తాను పోటీలో ఉండనని ప్రకటించారు. ఆమెకే మద్దతిస్తానని ప్రతి అడుగులోనూ తాను ఆమెకే మద్దతిచ్చానన్నారు. అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేయనని చెపుతున్న కమలా హారిస్ ఇప్పుడు కాలిఫోర్నియా గవర్నర్ పదవి పోటీకే ప్రాధాన్యత నిస్తున్నారు. ప్రస్తుత గవర్నర్ పదవీ కాలం 2026తో ముగుస్తుంది. న్యూసమ్ 2028 అధ్యక్ష ఎన్నికలకు డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా రావచ్చునన్న అంచనాలు కూడా ఉన్నా ఆయన వరకూ ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. మొత్తంగా చూస్తే అధ్యక్ష పదవికి ఎన్నికల్లో ఓటమి భారంతో కుంగిపోకుండా మళ్లీ ప్రజా జీవితంలోకి రావాలని ఈ మాజీ ఉపాధ్యక్షురాలు నిర్ణయించు కోవడాన్ని డెమొక్రాట్లు మొత్తంగా స్వాగతిస్తున్నారనే భావించాలి.

# పెరిగిన విద్యార్థులు.. తగ్గిన యూనివర్సిటీలు

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా 2023లోనే భారత్ అవతరించడం, ప్రపంచ జనాభాలో ఆరవ వంతు భారతీయులే ఉండడం, భారతీయుల సగటు వయస్సు 28.4 ఏండ్లు ఉంటూ ముద్దుగా 'యువభారత్' అంటూ నోరారా పిలవడం చూస్తున్నాం. అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా అవతరిస్తూ ఉజ్వల భవిష్యత్తును కలిగిన దేశంగా నిలుస్తూ, (2011 గణాంకాల ప్రకారం) దేశంలో అక్షరాస్యత రేటు 74.04 శాతం, ప్రాథమిక పాఠశాల స్థూల నమోదు నిష్పత్తి దాదాపు (జిఈఆర్) 100 శాతంగా, ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (2021-22 ప్రకారం) 28.4 శాతం నమోదు కావడం చూస్తున్నాం. భారత ప్రభుత్వ లక్ష్యాల ప్రకారం 2035 నాటికి ఉన్నత విద్యలో జిఈఆర్ 50 శాతానికి చేర్చడానికి ప్రణాళికలు అమలు చేస్తున్నారు. 2021-22లో యూనివర్సిటీ విద్యలో 4.43 కోట్లుగా ఉన్న నమోదును 9 కోట్లకు పెంచడానికి ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీల సంఖ్యను సైతం రెట్టింపు చేయవలసిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భారతీయ యువతను నైపుణ్యం కలిగిన విద్యావంతులుగా మార్చడంలో భారత్ విజయం సాధిస్తే 2047 నాటికి మన దేశం "వికసిత్ భారత్" స్థాయికి ఎదుగుతుందనడంలో అతిశయోక్తి లేదు. 2022 గణాంకాల ప్రకారం ప్రస్తుతం భారత్‌లో 1,160 యూనివర్సిటీలు ఉన్నాయని, ఇందులో 52 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 808 రాష్ట్ర, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 152 జాతీయ స్థాయి విద్యా సంస్థలు, 06 రాష్ట్ర స్థాయి సంస్థలు ఉన్నాయి. మన దేశంలో 418 ప్రభుత్వ యూనివర్సిటీలు, 390 ప్రైవేట్ యూనివర్సిటీలు, 80 ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలు, 44ప్రభుత్వ డీమ్డ్ యూనివర్సిటీలు, 18 ఓపెన్ యూనివర్సిటీలు(ఇందులో ఒక్కటి మాత్రమే ప్రైవేట్) ఉన్నాయి. అంటే దాదాపు 470 ప్రైవేట్ యూనివర్సిటీలు ఉండగా, అన్నీ కలుపుకొని దాదాపు 530 ప్రభుత్వ (రాష్ట్ర/కేంద్ర) యూనివర్సిటీలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా విస్తరించిన 1,160 యూనివర్సిటీల్లో 680 పట్టణ ప్రాంతాల్లో, 480 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. మన దేశ జనాభాలో 66 శాతం గ్రామీణంలో ఉండగా 41శాతం మాత్రమే ఆ ప్రాంతాల్లో ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో 34 శాతం జనాభా ఉండగా 59 శాతం యూనివర్సిటీలు ఈ పట్టణాల్లో నెలకొల్పడం జరిగింది. భారత్‌లో ఉన్న 47,947 కళాశాలల్లో 60 శాతం గ్రామీణంలో, 40 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. అధిక యువత నివసించే గ్రామీణ ప్రాంతాల్లో యూనివర్సిటీ లు, కాలేజీలు పెరిగితే గ్రామీణ యువత కూడా ఉన్నత విద్యాభ్యాసం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని గమనించాలి. అత్యధికంగా రాజస్థాన్‌లో 93, గుజరాత్ లో 91, యూపీలో 87 యూనివర్సిటీలు ఉండగా, అండమాన్ నికోబార్/లక్షద్వీప్ /దాద్రా నగర్ హవేలీ/డయ్యూ డమన్‌లలో ఒక్క యూనివర్సిటీ కూడా లేకపోవడం విచారకరం. జనాభా ప్రాతిపదికన ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువ జనాభా ఉన్నప్పటికీ ఎక్కువ ఉన్నత విద్యా సంస్థలు ఉండడం, యూపీ/బీహార్/ ఏపీ/ చత్తీస్‌ఘడ్‌లలో అధిక జనాభా ఉన్నప్పటికీ దానికి తగినట్లుగా కాకుండా తక్కువ విద్యా సంస్థలు ఉండడం గమనార్హం. దేశవ్యాప్తంగా జిల్లాల వివరాలను గమనిస్తే అత్యధికంగా జైపూర్ జిల్లాలో 35, బెంగుళూరు లో 25, అహ్మదాబాదు జిల్లాలో 21 యూనివర్సిటీలు ఉన్నాయి. మన దేశంలోని 160 జిల్లాల్లో ఒక్క యూనివర్సిటీ మాత్రమే ఉండగా, దాదాపు 380 జిల్లాల్లో (ముఖ్యంగా యూపీ, ఎంపీ, ఈశాన్య రాష్ట్రాల్లో) ఒక్క యూనివర్సిటీ కూడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. నగరాల వారిగా కాలేజీల్లో బెంగుళూరు అర్బన్‌లో 1,118 కాలేజీలు, జైపూర్‌లో 740, పూనెలో 628 కాలేజీలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 29 జిల్లాల్లో ఒక్క కాలేజీ కూడా లేకపోవడం, 85 జిల్లాల్లో ఐదు కన్న తక్కువ కాలేజీలు ఉండడం గమనించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 60 యూనివర్సిటీలు/కేంద్రీయ స్వయం ప్రతిపత్తి ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. అదే విధంగా తెలంగాణలో 28 యూనివర్సిటీలు /ఉన్నత విద్యా సంస్థలున్నాయి. హిమాలయన్, ఈశాన్య ప్రాంతాలకు చెందిన 14 యూటీ/రాష్ట్రాలకు చెందిన 169 జిల్లాల్లో యూనివర్సిటీలు, ఉన్నత విద్య బోధించే కళాశాలలు ఏర్పాటు చేయవలసిన అగత్యం ఏర్పడింది. ఈ ప్రాంతాల్లో 167 యూనివర్సిటీలు, 2,293 కాలేజీలు ఉన్నాయి. ఈ మారుమూల ప్రాంతాల్లో కెల్లా అత్యధికంగా డెహ్రాడూన్‌లో 19 యూనివర్సిటీలు, 132 కాలేజీలు ఉన్నాయి. ఇలాంటి మారుమూల ప్రాంతాలకు చెందిన 116 జిల్లాల్లో ఒక్క యూనివర్సిటీ కూడా లేకపోవడం, 23 జిల్లాల్లో ఒక్క కాలేజీ కూడా లేకపోవడం గమనార్హం. భారత ప్రభుత్వం గుర్తించిన ఆస్పిరేషనల్ జిల్లాలు లేదా ఆకాంక్ష కలిగిన 112 జిల్లాల్లో 74 జిల్లాల్లో యూనివర్సిటీలు లేకపోవడం, 43 జిల్లాల్లో ఒక్క యూనివర్సిటీ మాత్రమే ఉండడం గమనించారు. ఈ వర్గంలో కేవలం రాంచీలో మాత్రమే 18 యూనివర్సిటీలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 2015-16లో 755 యూనివర్సిటీలుండగా, 2022 నాటికి వాటి సంఖ్య 1,160కి పెరగడం జరిగింది. ప్రస్తుతం ఒక లక్ష (18-23 ఏండ్ల) యువతకు 0.8యూనివర్సిటీలు ఉండగా, 33 కళాశాలలు ఉన్నాయి. చండీఘర్‌లో ఒక లక్ష యువతకు 17 యూనివర్సిటీలు ఉండగా, యూపీ/బీహార్/ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఒకటి కన్న తక్కువగా నమోదు అయ్యాయి. లక్ష యువ జనాభాకు అరుణాచల్‌లో 1,692 కాలేజీలు ఉండగా, ఛత్తీస్‌ఘడ్/ ఏపీల్లో ఒక్క కాలేజీ మాత్రమే ఉన్నది. ఉన్నత విద్యలో జీఈఆర్ 28.4 శాతం ఉండగా, ఇందులో మహిళ లకు 28.5 శాతం, పురుషులకు 28.3 శాతంగా నమోదు అయ్యింది. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలు/యూటీల్లో జీఈఆర్ దేశ సగటు కన్న తక్కువగా ఉండగా, తమిళనాడులో అత్యధికంగా 47 శాతం ఉన్నది. మొత్తంగా 10 రాష్ట్రాల్లో జీఈఆర్ ఒకటి కన్న తక్కువగా నమోదు కావడం విచార కరం. ఇప్పటికీ ఒక్క యూనివర్సిటీ కూడా లేని మూడు యూటీల్లో యూనివర్సిటీలను నెలకొల్పడం లేదా ప్రస్తుత కళాశాలలకు స్వయం ప్రతిపత్తి కలిపించడం లేదా డీమ్డ్ యూనివర్సిటీలుగా మార్చడం జరగాలి. ఒక్క యూనివర్సిటీ కూడా లేని 380 జిల్లాల్లో నెలకొల్పిన కాలేజీలను అప్‌గ్రేడ్ చేయడం లేదా క్లస్టర్ యూనివర్సిటీలుగా మార్చడం సత్వరమే జరగాలి. నేడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పడం, మహిళా విద్యకు పెద్దపీట వేయడం సత్వర అవసరంగా తోస్తున్నది. నేడు సేవలు అందిస్తున్న యూనివర్సిటీ/ కాలేజీలతో పాటు నూతనంగా నెలకొల్పే యూనివర్సిటీలు లేదా కాలేజీల్లో అన్ని రకాలైన వసతులను కల్పించడం, విద్యతో పాటు నైపుణ్యాలను పెంచిపోషించడం జరగాలి. యువభారతాన్ని నైపుణ్య భారతం"గా మార్చితేనే 2035 నాటికి 50 శాతానికి జిఈఆర్ చేరడంతో పాటు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధన కూడా సుసాధ్యం అవుతుంది. మన దేశంలో 34 యూనివర్సిటీలు, 113 ఉన్నత విద్యాసంస్థలు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నాయి. మన దేశంలో 18-35 ఏండ్ల వయస్సు ఉన్న యువత 60 కోట్లు ఉన్నారు. వారందరికీ ఉన్నత విద్య అందితే రానున్న రోజుల్లో భారత భవిష్యత్తు ఘనంగా వెలుగొందుతుందని నమ్ముదాం. ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలు లేని లేదా తక్కువగా ఉన్న మారుమూల ప్రాంతాల విశిష్టత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సాంస్కృతిక వారసత్వాలను కాపాడుకుంటూ ఉన్నత విద్యలో మన యువభారతం రాణిస్తూ, దేశ సుస్థిరాభివృద్ధికి బాటలు వేయాలి. ప్రపంచానికే మన నైపుణ్య యువ భారతం" దారి దీపం కావాలని ఆకాంక్షిద్దాం.



# మహిళా శక్తితోనే మరింత అభివృద్ధి

## నారీశక్తిసే వికసిత్‌భారత్‌సదస్సులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ, మార్చి 8:** స్వయంసాధికారత సాధించిన మహిళాశక్తితోనే భారత్ మరింత అభివృద్ధివైపు దూసుకు వెళుతుందని నవీనభారత్ వృద్ధిలో ఆత్మనిర్భరత, స్వయంసమృద్ధి, స్వతంత్ర సాధికారత కలిగిన మహిళాశక్తితోనే సాధ్యం అవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలకు తోడుగా పురుషుల మద్దతు లభిస్తే మరింత శక్తివంతులవుతారని స్వయంసమృద్ధిని సాధించగలుగుతారని రాష్ట్రపతి అన్నారు. నారిశక్తిసే వికసిత్‌భారత్ పేరిట నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు ఆత్మవిశ్వాసం, అంకితభావం, కఠోరశ్రమతో ముందుకువెళ్లాలని, సమాజానికి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సదస్సులో రాష్ట్రపతి మాట్లాడుతూ భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా మారుతోందని, అందుకు అనుగుణంగానే కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం కూడా మరింతపెరగాలని సూచించారు. అభివృద్ధి చెందిన భారత్‌గా నిలదొక్కుకునేందుకు బాలికలకు, మహిళలకు సమున్నత వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగినపుడే వారి జీవితంలో ఒత్తిళ్లు, భయాలు ఉండని రాష్ట్రపతి అన్నారు. దేశంలో ఏ ఒక్క కూతురు, సోదరి ఎక్కడికైనాసరే నిర్భయంగా వెళ్లగలిగే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలపట్ల గౌరవం పెరిగితేనే సామాజిక వాతావరణంలో భయాలకు తావుండదని, ఇలాంటి వాతావరణం మనం కల్పించినపుడే దేశం సరికొత్త ఉన్నత శిఖరాలకు చేరుతుందని అన్నారు. కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉండకూడదని అన్నారు. తనవరకూ తాను ఒక చిన్న కుటుంబంనుంచి ఒడిశాలోని పూర్తిగా వెనుకబడిన ప్రాంతంనుంచి వచ్చానన్నారు. మహిళల భాగస్వామ్యంతో సాధించిన విజయాలు మరిన్ని పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మనం 50 సంవత్సరాల అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఈ కాలంలోనే మహిళాశక్తి అనూహ్యరీతిన ప్రగతిని సాధించిందని రాష్ట్రపతి ముర్ము హర్షం ప్రకటించారు. కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖమంత్రి అన్నపూర్ణదేవి సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్, సీనియర్ అధికారులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సాయుధదళాలు, పారామిలిటరీ విభాగాల్లోని మహిళలు, అంగన్‌వాడి, ఆశా, స్వయంసహాయక బృందాల మహిళలు ఎక్కువ మంది పాల్గొంటున్నారు.

# నారీ శక్తికి వందనం

## ప్రధాని ఖాతానుంచే మహిళల అనుభవాలతో పోస్టులు



**న్యూఢిల్లీ, మార్చి 8:** అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని నారీశక్తికి వందనం అంటూ దేశంలోని మహిళలకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ అభి వృద్ధి పథకాలద్వారా ఎన్డీయే ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషిచేస్తోందని చెప్పారు. తన సోషల్‌మీడియా ఖాతాలను మహిళలే ఈరోజు నిర్వహించారన్నారు. అందుకు తగ్గట్లుగానే మోడి ఎక్స్‌ఖాతానుంచి చెస్‌క్రీడాకారిణి ఆర్ వైశాలి వరుస పోస్టులుపెట్టారు. నేను వైశాలి. మహిళా దినోత్సవం రోజున ప్రధానిమోడీ సోషల్‌మీడియా ఖాతానుంచి పోస్టుచేయడం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. నేనొక చెస్‌ప్లేయర్. ఎన్నో టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంటుంది. ఆరో ఏటనుంచే నేను చెస్ ఆడుతున్నా. మీరు ఎంచుకున్న మార్గంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా మీకలలు సాకారంచేసుకోడానికి ముందుకు సాగాలని సూచించారు. ఆడపిల్లలకు అండగా నిలవాలని తల్లితండ్రులు తోబుట్టువులనను ఈసందర్భంగా కోరుతున్నట్లు తెలిపారు. నా అదృష్టం కొద్దీ నా తల్లితండ్రులు సోదరుడు అండగా ఉన్నారు. నా సోదరుడితోప్రత్యేక అనుంబంధం ఉందని ఆమె పోస్టుచేసారు. ఆ తర్వాతన న్యూక్లియర్, స్పేస్ సైంటిస్ట్‌లు లయిన ఎలినా మిశ్రా, శిల్పిసోనీ, మోడీ ఖాతానుంచి పోస్టులుపెట్టారు. భారత దేశం సైన్స్‌పరి శోధనలకు అత్యంత అనుకూలమైన ప్రదేశం అన్నారు. మరింత ఎక్కువమంది మహిళలు ఈ రంగాన్ని ఎంచుకోవాలనికోరారు. బీహార్‌లోని నలందా జిల్లాకు చెందిన అనితాదేవి ప్రధాని ఖాతానుంచి తన విజయాలు తెలిపారు. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నానని, నాకాళ్లపై నిలబడం సొంతంగా సాధించాలన్న తపన ఉండేదన్నారు. 2016లో ఆదిశగా అడుగులువేసానని, అప్పుడే స్టార్టప్‌లపై క్రేజ్‌పెరుగుతోందని, తాను కూడా మాధోపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. నాతో కలిసి పనిచేసిన మహిళలు స్వయం సమృద్ధి సాధించడం నాకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వారి కుటుంబాలు బాగుపడటం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు గౌరవాన్ని ఇస్తుందని నానమ్మకమని మీరు అంకితభావం కృషితో ముందుకు సాగాలని బలంగా అనుకుంటే ఏశక్తి మిమ్మల్ని ఆపలేదనంటూ తన స్టోరీ వెల్లడించారు. తర్వాత ఫ్రాంటియర్ మార్కెట్ సిఇఒ అజైతాషా, డాక్టర్ అంజలీ అగర్వాల్‌లు కూడా తమ ప్రయాణం గురించి వెల్లడించారని తెలిపారు.

# 'మహిళా సమృద్ధియోజన' ప్రారంభించిన ఢిల్లీ సర్కారు




**న్యూఢిల్లీ, మార్చి 8:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా బిజెపి ఢిల్లీప్రభుత్వం మహిళా సమృద్ధియోజన పథకాన్ని ప్రారంబిస్తున్నట్లు ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు శనివారం నుంచే ఈపథకం ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలోని జెఎల్ఎన్‌స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా ఈ ప్రకటనచేసారు. అంతకుముందే ఢిల్లీకేబినెట్ ఈ పథకాన్ని ఆమోదించింది. ఢిల్లీసీఎం రేఖా గుప్తానత మాట్లాడతూ మహిళా సమృద్ధియోజన మహిళల ఆర్థికాభివృద్ధికి నిర్దేశించిందన్నారు. ఢిల్లీ మహిళలు ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారికి నెలనెలా రూ.2500 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమచేయడం జరుగుతుందన్నారు. ఈపథకానికి రిజిస్ట్రేషన్ కూడా వెంటనే ప్రారంభిస్తున్నట్లు రేఖాగుప్తా తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోసం ఢిల్లీ ప్రభుత్వం ఒక ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించనున్నది. ఇందు కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించారు. లబ్ధిదరుల పరిశీలన, అర్హత ప్రమాణాల తనిఖీలను కూడా ఈ వెబ్‌సైట్‌ద్వారానే నిర్వహిస్తారు. ప్రభుత్వంలోని ఐటి విభాగం ఇందుకు సంబందించి వివిధ శాఖలనుంచి డేటాను కూడా సమీకరిస్తోంది. ఇతర శాఖల్లోని మహిళా లబ్దిదారుల వివరాలను కూడాసేకరిస్తోంది. అర్హులైన లబ్దిదారులు ఢిల్లీ నివాసితులయి ఉండాలని, 18 నుంచి 60 ఏళ్లలోపు వారయి, మూడులక్షల సాలీనా ఆదాయం కలిగి ఉండాలని, ఆదాయపు పన్ను చెల్లించనివారయి ఉండాలని నిబంధనలు విధించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఇప్పటికే ఆరినతక సాయం పొందుతున్నవారు కూడా అనర్హులని తేల్చింది. వితంతు పింఛన్, వృద్ధాప్యపింఛన్‌పొందేవారు కూడా ఈ పథకానికి అర్హులు కాదు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, అడ్రస్‌ప్రూఫ్, రిజిస్టరు అయిన మొబైల్‌నంబరులు ఈ ప్రక్రియకు మూలంగా ఢిల్లీసర్కారు ప్రకటించింది. సుమారు 15నుంచి 20 లక్షలమంది మహిళలు ఈ పథకం కింద లబ్ధిపొందగలరని తేలింది. ఈపథకం అమలుతో ప్రభుత్వంపై సాలీనా సుమారు ఐదువేల కోట్ల భారం పడుతోంది.

# ఇజ్రాయెల్ టూరిస్టు, మహిళా ఆపరేటర్‌లపై గ్యాంగ్‌రేప్

## నిందితుల్లో ఇద్దరు అరెస్టు, మరొకరికోసం ముమ్మరగాలింపు

**కొప్పల్, మార్చి 8:** హంపి ప్రాంతంలో ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారంజరిగిన సంఘటన కర్ణాటకలో వెలుగులోకి వచ్చింది. ఇద్దరు మహిళల్లో ఒకరు ఇజ్రాయెల్ మహిళ కావడంతో ఇపుడు ఈ అంశం అంతర్జాతీయస్థాయికి వెళుతుందన్న ఆందోళన పెరిగింది. వారితో వచ్చిన ముగ్గురు పురుష పర్యాటకులను తీవ్రంగా హింసించి సమీపంలోని కాలువలోకి తోసేసారు. ఈసంఘటనకు సంబంధించి మల్లేష్ అలియాస్ హండిమల్ల(22), చేతన్‌సాయి(21) అనే ఇద్దరు యువకులను అరెస్టుచేసినట్లు తెలిపారు. మూడో నిందితుడికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు హంపి పోలీసులు తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని గుర్తించారు. ఇజ్రాయెల్ టూరిస్టుతో పాటు హోంస్టే ఆపరేటర్, మరో ముగ్గురు పురుష టూరిస్టులు తుంగభద్ర కాలువ ఎడమ గట్టువైపు కూర్చుని సేద తీరుతున్నారు. సానాపూర్ సరస్సు ప్రాంతంలో వారు గిటార్ వాయిస్తూ సంగీతాన్ని ఆస్వాదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు టూరిస్టుల్లో ఒకరు అమెరికా నుంచి కాగా మరో ఇద్దరు ఒడిశా, మహారాష్ట్రకు చెందినవారని తేలింది. మోటారుసైకిల్‌పై వచ్చిన ముగ్గురు యువకులు తమవైపు దూసుకువచ్చి పెట్రోలు ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారని, అయితే సమీపంలో ఎక్కడా పెట్రోలు బంకులు లేవని చెప్పానని నిందితులు రూ.100 కావాలని డిమాండ్ చేసారని హోమ్‌స్టే ఆపరేటర్ తెలిపింది. పదేపదే ఒత్తిడిచేస్తుండటంతో ఒడిశా పర్యాటకుడు 20 రూపాయలు ఇచ్చాడని, ఆ తర్వాత ముగ్గురు నిందితులు వాదనకు దిగి రాళ్లతో తలలు పగులగొడతామని బెదిరించారన్నారు. కన్నడం, తెలుగులో మాట్లాడిన నిందితులు పర్యాటకులను అసభ్యంగా దూషించడం ప్రారంభించారు. ముందు హోంస్టే ఆపరేటర్‌ను, ఇజ్రాయెల్ పర్యాటకురాలిపైనా అత్యాచారం చేసారని, ముగ్గురు పురుష పర్యాటకులను కాలువలోకి తోసివేసినట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ముగ్గురిలో ఇద్దరు నిందితులు హోమ్‌స్టే ఆపరేటర్‌ను తీవ్రంగా కొట్టాడని, మూడో వ్యక్తి పురుష పర్యాటకులను కాలువలోకి తోసివేసాడని ఫిర్యాదులో వెల్లడించారు. నిందితుడు ఆమెను కాలువ ఒడ్డుకు లాక్కునిపోయి చేతులు కట్టివేసి ఆమె దుస్తులు తొలగించారని, ఇద్దరు నిందితులు ఆమెను కొడుతూ హింసించి అత్యాచారంచేసారని ఆమె



బ్యాగ్‌ను కూడా దొంగిలించి ఇద్దరు మొబైల్ ఫోన్లను 9,500 నగదును దొంగిలించినట్లు ఎఫ్ఐఆర్‌లో వెల్లడించారు. మరో నిందితుడు ఇజ్రాయెల్ టూరిస్టును కాలువ ఒడ్డుకు లాక్కునిపోయి ఆమెపైనా లైంగిక హింసకు పాల్పడ్డాడని, ఆతర్వాత మోటారుసైకిల్‌పై వెళ్లిపోయారని తెలిపారు. ముగ్గురుపురుష పర్యాటకుల్లో ఇద్దరు తీవ్రగాయాలతో బయటపడగా మరొకరు మృతిచెందారు. ఆతని మృతదేహం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. గంగావతి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఈసంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇద్దరు మహిళలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



## చైనా, పాకిస్థాన్‌ల మధ్య కుట్రపూరిత సంబంధాలు

### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ, మార్చి 8:** చైనా, పాకిస్తాన్‌ను ఉద్దేశించి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండింటి ఉన్న కుట్రపూరిత సంబంధాలను భారత్ తప్పక అంగీకరించాలన్నారు. ఈ మేరకు ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. వర్చువల్ డొమైన్‌లో ఆ రెండు దేశాల మధ్య బంధం వందశాతంగా ఉంది. భౌతికంగా పరిశీలిస్తే చైనాలో తయారైన మిలిటరీ ఉత్పత్తులను పాక్ వినియోగిస్తోంది. రెండువైపుల నుంచి యుద్ధం ముప్పు ఉందనేది వాస్తవం. అలాగే వేసవి సమీపిస్తున్న కొద్దీ జమ్మూకశ్మీర్‌లో చొరబాట్లు పెరిగే అవకాశం ఉంది. సరిహద్దుల వెంబడి చొరబాట్లు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఉగ్రవాదుల కదలికలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది అని ద్వివేది వెల్లడించారు. ఇక, ఉగ్రవాద కట్టడికి భారత సైన్యం గట్టి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈవిషయంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. 2018 నుంచి ఉగ్రవాద ఘటనల సంఖ్య 83 శాతం తగ్గాయన్నారు. కేవలం 45 మంది మాత్రమే ఉగ్ర కార్యకలాపాల వైపు ఆకర్షితులయ్యారని చెప్పారు. సైన్యం చర్యలతో పర్యాటకం పెరిగిందన్నారు.

# ఎన్టీపీసి డిజిఎం కాల్చివేత

### హజారిబాగ్‌లో దుండగుల ఘాతుకం

**రాంచి, మార్చి 8:** ఎన్టీపీసికి చెందిన డిప్యూటి జనరల్‌మేనేజర్ కుమార్ గౌరవ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. హజారిబాగ్‌లో జరిగిన ఈ సంఘటనలో గౌరవ్‌ను అతి సమీపంనుంచే కాల్పులుజరపడంతో లోతైన బుల్లెట్‌గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. హజారిబాగ్ ఎస్పీ అరవింద్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ డిజిఎంను తుపాకితో కాల్చిచంపారని ధృవీకరించారు. పోలీసులు ఇందుకోసం ప్రత్యేకబృందాలు ఏర్పాటుచేసి గాలింపుచర్యలు ముమ్మరం చేసామన్నారు. హజారిబాగ్‌లోని కట్కామ్‌డాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతాహ్ ప్రాంతంలో ఈసంఘటన జరిగినట్లు తేలింది. కుమార్‌గౌరవ్ ఎన్టీపీసి కెరెడారి ఆఫీసులో డిజిఎంగా డిస్పాచ్ సెక్షన్‌లో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం ఆయన డ్యూటీకి వెళుతుండగానే నేరగాళ్లు ఆయనపై కాల్పులుజరిపారు. తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. రెండేళ్లక్రితం ఇలాంటి సంఘటనే మరోటి జరిగింది. నేరగాళ్లు రిత్విక్ కంపెనీకి చెందిన జీఎంను కాల్చి చంపారు. కాగా శనివారం నాటి కాల్పులసంఘటనతో ఎన్టీపీసి అధికారులు, సిబ్బందిలో భయాందోళనలు పెరిగాయి. హజారిబాగ్‌లోని బార్కాగాంవ్‌లో అనేక ఎన్టీపీసి ప్రాజెక్టులు అమలవుతున్నాయి. కెరెదారి ప్రాంతంలో కూడాప్రాజెక్టులున్నాయి.



### కోట్లాదిమంది ఆశీస్సులున్న నేనే

# అందరికంటే రిచ్..

## నవ్‌సారిలో మహిళా సదస్సులో ప్రధాని మోడీ

**అహ్మదాబాద్, మార్చి 8:** పదేళ్ల ఎన్డీయే పాలనలో మహిళాభద్రతకోసం తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధానిమోడీ అన్నారు. అత్యాచారం వంటి క్రూరమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలను సవరించామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవ్‌సారిలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో మాట్లాడిన ఆయన మహిళల నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఒక అమ్మాయి ఆలస్యంగా ఇంటికి వస్తే తల్లితండ్రులు ఆమెను ప్రశ్నిస్తారని, కానీ అబ్బాయిల విషయంలో అలా ఉండదని కానీ వారినికూడా ప్రశ్నించాలని, గడిచిన దశాబ్దంలో మహిళల భద్రత, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు అత్యధికప్రాధాన్యం ఇచ్చామని నిబంధనలు చట్టాలు కూడా మార్చామన్నారు. అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలు సవరించామన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. దేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని గాంధీజీ చెప్పిన మాటను గుర్తుచేసిన ఆయన మహిళలు మన గ్రామీణ్ ప్రాంతాలకు ఆత్మగా దానికి జతచేయాలనుకుంటున్నానని అన్నారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకువచ్చి లక్షలమంది ముస్లిం మహిళల జీవితాలు నాశనం కాకుండా కాపాడామన్నారు. మహిళల సార్థ్యంలోని ఎన్నో సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. కోట్లాదిమంది తల్లులు సోదరీమణుల ఆశీర్వాదం కలిగిన తానుప్రపంచంలోనే అత్యంత సంపన్నుడినని కార్యక్రమంలో ప్రధాని అన్నారు.

### నటి రన్యారావు శరీరంపై పలు చోట్ల గాయాలు..

# వెల్లడించిన డిఆర్ఐ



**బెంగళూరు, మార్చి 8:** బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన నటి రన్యారావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. కేసు విచారణలో భాగంగా నిందితురాలు గురించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ సంచలన విషయాలు బయటపెట్టింది. రన్యారావు శరీరంపై పలుచోట్ల గాయాలున్నాయని పేర్కొంది. రన్యారావు విఐపి ప్రోటోకాల్స్‌ను దుర్వినియోగం చేస్తూ ఓ సిండికేట్ ముఠా బంగారం దందాలో భాగమైనట్లు గుర్తించామని డిఆర్ఐ తెలిపింది. ఆమె శరీరంపై పలుచోట్ల గాయాలున్నాయని పేర్కొంది. అయితే దుబాయ్‌కి వెళ్లడానికి చాలాకాలం ముందే తనకు ఈ గాయాలు అయ్యాయని నటి ఏజెన్సీకి తెలిపింది. దీంతో అవసరమైన వైద్య సహాయం అందించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. నిందితురాలు దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించడం లేదని డిఆర్ఐ కోర్టుకు తెలిపింది. కోర్టులో ప్రవేశపెట్టగానే న్యాయమూర్తి ముందు నటి కంటతడి పెట్టుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ కేసుకు సంబంధించి మూడు రోజులపాటు విచారించేందుకు డిఆర్ఐకు అనుమతిస్తూ సంబంధిత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. రన్యారావు నుంచి డిఆర్ఐ అధికారులు ఇప్పటికే 14.2 కిలోల బంగారు బిస్కెట్లు, సుమారు రూ.2.06 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.2.67 కోట్ల నగదు జప్తు చేసుకున్నారు. గత ఆరునెలల్లో ఆమె 27 సార్లు దుబాయ్‌కు వెళ్లి వచ్చిందని, దాంతో పాటు సౌదీ అరేబియా, అమెరికా, పశ్చిమాసియా, ఐరోపా దేశాలకు ఆమె ప్రయాణించినట్లు డిఆర్ఐ అధికారులు తాజా విచారణలో గుర్తించారు. మరోవైపు సంఘవిద్రోహ శక్తులతో ఆమెకు సంబంధాలు ఉన్నాయని ప్రాథమిక విచారణలో గుర్తించిన అధికారులు ఆ దిశగా విచారిస్తున్నారు. కాగా బెయిల్ కోసం ప్రత్యేక న్యాయస్థానంలో రన్యారావు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చిన విషయం తెలిసిందే.

# కాలిఫోర్నియా గవర్నర్‌గా కమలాహారిస్ పోటీ!



**వాషింగ్టన్, మార్చి 8:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అప్పటి ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ ఓడిపోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిస్తోంది. ఈ మేరకు పాలు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు కార్యక్రమాల్లో కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధమైనట్లు సూచనప్రాయంగా తెలిపారు. మరికొన్ని రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక, ఆమె2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దైరంగా ఉండాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దశాబ్దాలుగా కాలిఫోర్నియా వాసులు డెమోక్రట్లకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆమె ఈ ఎన్నికల్లో పోటీకి దిగితే తప్పక విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ పోటీ చేసి ఓడిపోయారు. అధికారం చేజిక్కించుకోవడానికి కీలకమైన స్వింగ్ రాష్ట్రాలను సొంతం చేసుకుంటూ ట్రంప్ 312 ఎలక్టోరల్ ఓట్లతో విజయం సాధించగా, హారిస్ 226 ఎలక్టోరల్ ఓట్లను కైవసం చేసుకున్నారు. ఓటమి అనంతరం హారిస్ మాట్లాడుతూ కొన్ని సార్లు సానుకూల ఫలితాలకు సమయం పడుతుందని అంతేకాని గెలవలేమని కాదని పేర్కొన్నారు. స్వేచ్ఛ, న్యాయం, భవిష్యత్తు కోసం మళ్లీ నిలబడాల్సిన, నిమగ్నం కావాల్సిన సమ యం ఇదేనని తన మద్దతుదారులకు పిలుపు నిచ్చారు.

# గుజరాత్‌లో బిజెపి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించాలి: రాహుల్‌గాంధీ



**గాంధీనగర్, మార్చి 8:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఉంటూ బిజెపి కోసం పనిచేస్తున్న కార్యకర్తలను, నేత లను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మన బాధ్యతలు నెరవేర్చేంతవరకు అధికారం ఇవ్వమని గుజరాత్ ప్రజలను అడగకూడదని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ ఈ విధంగా మాట్లాడారు. తమ పార్టీ బాధ్యతలు నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రజలు తమకు ఓటు వేయరని రాహుల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా బిజెపి అందించిన పాలన విఫలమైందని, గుజరాత్ ప్రజలు కొత్త విజన్ కోసం వేచి చూస్తున్నారని అన్నారు. ఆశించిన విధంగా రాష్ట్రం ప్రగతి సాధించడంలేదని, కాంగ్రెస్ కూడా అందుకు సరైనా మార్గాన్ని చూపించలేకపోతోందని అభిప్రాయపడ్డారు. 'గుజరాత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెండు రకాలున్నారు. నిజాయతీగా పనిచేస్తూ ప్రజలను గౌరవిస్తూ, వారికోసం పోరాడుతూ, పార్టీ సిద్ధాంతాన్ని తమ గుండెల్లో పెట్టుకునేవారు ఒకరు. రెండో రకానికి వస్తే ప్రజలతో సంబంధాలు కొనసాగించకుండా వారితో దూరంగా ఉండటమే కాకుండా గౌరవం కూడా ఇవ్వరు. ఇందులో సగంమంది బిజెపితో ఉన్నారు' కీలక వ్యాఖ్యలు చేశారు.



## బలవంతపు మతమార్పిడికి పాల్పడితే మరణశిక్ష

### మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హెచ్చరిక

**భోపాల్, మార్చి 8:** బలవంతపు మత మార్పిడిని సహించబోమని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ అన్నారు. నిందితులకు మరణశిక్ష పడేలా చేస్తామని హెచ్చరించారు. దీని కోసం తమ ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువస్తుందని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సిఎం మోహన్‌యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులను అనుమతించబోమని స్పష్టంచేశారు. 'మా అమాయక కుమార్తెలపై దారుణాలకు పాల్పడే వారిపై మా ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

### డొనాల్డ్ ట్రంప్ కేబినెట్ సమావేశంలో

# మార్కోరూబియో, ఎలాన్ మస్క్ మధ్య వాగ్వాదం



**వాషింగ్టన్, మార్చి 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలో నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ గొడవ పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు వార్తా సంస్థలు కథనాలు వెల్లడిస్తున్నాయి. ఆ కథనాల ప్రకారం అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డిఒజిఇ) శాఖను ట్రంప్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ శాఖ వృథా ఖర్చులను తగ్గించేందుకు, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులే లక్ష్యంగా భారీగా ఉద్యోగులను తొలగిస్తుంది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విమర్శలపై చర్చించేందుకు ట్రంప్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. అందులో డోజ్ బాధ్యతలు నిర్వహిస్తున్న మస్క్, విదేశాంగ మంత్రి రూబియోలు సైతం పాల్గొన్నారు. ఆ సమయంలో మస్క్ మాట్లాడుతూ రూబియో ఎవరినీ ఉద్యోగాల నుంచి తొలగించలేదని, తాను మాత్రం పనిచేయని వారిని తొలగిస్తున్నానన్నారు. దీనిపై రూబియో మాట్లాడుతూ 'ఇప్పటికే 1500 మంది ఉద్యోగులు ముందే పదవీవిరమణ చేశారు. నేను తొలగించాలంటే వారిని మళ్లీ విధులోకి తీసుకొని తొలగించాల్సి వస్తుంది' అని వ్యంగ్యంగా సమాధానమిచ్చినట్లు సమాచారం.

**స్పందించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్:** ఇక, ఈ కథనాలపై ఓవల్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ స్పందించారు. 'ఘర్షణ లాంటిది ఏమిలేదు. నేను అక్కడే ఉన్నా. మస్క్ రూబియోతో కలిసిపోయాడు. వారిద్దరూ అద్భుతంగా పనిచేస్తున్నారు' అని ట్రంప్ బదులిచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వ్యయాలను కట్టడి చేయడం కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్)ను ఏర్పాటు చేశారు. దీని పగ్గాలను మస్క్‌కు అప్పగించారు. ఇందులో భాగంగా వేల మంది ఫెడరల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తొలగించేందుకు మస్క్ సిఫారసు చేస్తున్నారు. తాను సిబ్బందిని తగ్గించడం తోపాటు బాగా పని చేసే వారిని ఉన్నత స్థానా లకు తీసుకొస్తానని చెప్పారు. పలువురు నిపు ణులు, డెమోక్రాట్లు మస్క్ చర్యలు సరైనవి కా వని విమర్శలు గుప్పిస్తుండగా ట్రంప్ వాటిని ఖండిస్తూ వస్తున్నారు.

# 36 మందికి వలపు వల విసిరిన చైనా కిలేడీ!

## ఫ్లాట్ల పేరిట యువకులకు కుచ్చుటోపీ

**బీజింగ్, మార్చి 8:** ప్రేమ పేరిట వలపు వల విసిరి 36 మంది యువకులను బురిడీ కొట్టించిన కిలాడీ లేడీ ఉదంతమిది. బ్యాంకుల్లో లోన్ పెట్టించి మరి, వారితో ఫ్లాట్లు కొనిపించి ఆ తర్వాత పత్తా లేకుండా పోయింది. రియల్ ఎస్టేట్ రంగంలోని ఈ తరహా మోసం చైనాలో వెలుగుచూసింది. మీడియా కథనాల ప్రకారం లియుజియా అనే మహిళ డేటింగ్ పేరిట పలువురు యువకులను ముగ్గులోకి దింపింది. తనది హునాన్ ప్రావిన్స్ అని, షెన్‌జెన్‌లోని ఎలక్ట్రిక్ కామర్స్ కంపెనీలో పనిచేస్తున్నానని నమ్మబలికింది. ఆ మాటలు నమ్మిన యువకులు ఒకరి తెలియకుండా మరొకరు ఆమెతో ప్రేమలో పడ్డారు. అప్పుడే ఆమె వారికి ఓ షరతు పెట్టింది. రిలేషన్ మొదలెట్టాలన్నా, యువకుడి తల్లిదండ్రులను కలవాలన్నా ముందు ఒక ఇల్లు కొనాలని చెప్పింది. అందుకు తాను కూడా ఆర్థిక సాయం చేస్తానని నమ్మబలికింది. ఆమె బాధ్యతాయుత ప్రవర్తనకు ముగ్ధులై యువకులు ఆమె చెప్పినట్టుగా హుయ్‌జౌ, గాంగ్‌డాంగ్ ప్రాంతాల్లో ఇళ్లు కొనుగోలు చేశారు.



ఇక ఆ తర్వాత నుంచి ఆమె అసలు స్వరూపం బయటపడింది. పొడిపొడిగా మాట్లాడటం మొదలుపెట్టి తర్వాత ఫోన్‌లో అందుబాటులోకి రావడమే మానేసింది. ఇలా ఆమె చేతిలో 36 మంది మోసపోయారు. తాము ప్రేమించింది ఒకే అమ్మాయినని తెలిసి కంగుతిన్నారు. కొద్ది రోజుల ప్రేమతోనే అప్పులపాలై చివరకు ఇఎంఐలు కట్టలేక వాపోతున్నారు. ఫ్లాట్లు అమ్మడం కోసం రియల్ ఎస్టేట్‌కు చెందిన సంస్థ వేసిన కుట్రలో తాము బలైపోయామని లబోదిబోమంటున్నారు.



ఆర్‌టిసి బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దుర్‌శెట్టి

## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), మార్చి 8, ప్రభాతవార్త:** ప్రపంచమహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దుర్‌శెట్టితోపాటు ఆర్‌టిసి అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్‌శెట్టి, ఆర్‌టిసి అధికారులతో కలిసి బస్సులో ప్రయాణించారు. అంతకుముందు అత్యు త్తమ ప్రతిభ కనబర్చిన ఆర్‌టిసి ఉద్యోగులను సన్మానించారు. బస్సులో ప్రయా ణిస్తూ ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంజిబిఎస్ బస్‌స్టేషన్‌లో మహిళా ప్రయాణికులకు గులాబీలు, స్వీట్లు ఇచ్చి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆర్‌టిసి బస్సులో ఉచితంగా మహిళలు ప్రయాణం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 150 కోట్ల మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణించినట్లు చెప్పారు. ఎంజిబిఎస్ బస్‌స్టేషన్ నుండి ఫలక్‌నుమా వరకు మహిళా ప్రయాణికులు, ఆర్‌టిసి మహిళా ఉద్యోగులతో కలిసి బస్సులో ప్రయా ణం చేశారు. నిన్నే(శుక్రవారం) ఆర్‌టిసి ఉద్యోగులకు 2.5 శాతం డిఎ ప్రకటిం చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఇడి రాజశేఖర్, ఆర్‌ఎం శ్రీలత, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడండి

### అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

### ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చూడాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రభాతవార్త, నడిగూడెం, సూర్యాపేట:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ వేసవిలో తాగునీరు, సాగునీరు, విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శనివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో ఉమ్మడి నల్గొండ జిల్లా తాగునీరు, ఇరిగేషన్,విద్యుత్ అంశాలపై నిర్వ హించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, అలాగే పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగే విధంగా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి అధికారులందరూ క్షేత్రాలు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవా లన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా ఈ ఎన్ సి స్థాయిలో పూర్తి దృష్టి సారించాలన్నారు. తక్షణ తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే జిల్లా కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులు బాటు కల్పిస్తామని, అలాగే ముఖ్యమంత్రితో చర్చించి శాసన సభ్యులకు ఎస్‌డిఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చర్చిస్తామన్నారు. ఇరిగేషన్ కి సంబంధించి ఒక ఎకరం పొలం ఎండిపోకుండా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలు కాపాడాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కాలువలపై పర్యటించాలని, అలాగే వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తిరిగి ఎప్పటికప్పుడు నీటి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కింద ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సరైన విధంగా పర్యవేక్షణ చేసి అందరికీ వచ్చేలా చూడాలని చెప్పారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలోనే తిరిగి తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ మూడు సమస్యలపై మనసుపెట్టి పనిచేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులు సైతం మండల స్థాయి అధికారులను వెంట తీసుకుని వెళ్లి గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ వేసవిలో పై మూడు అంశాల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిం చాలని,ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతి నిధులు మనసుపెట్టి పనిచేసే సమన్వ యంతో కృషి చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణం తాగునీటి అవసరాలకు జిల్లా కలెక్టర్ల వద్ద ప్రతి జిల్లాకు కనీసం 5 కోట్లు, నల్గొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున 15 కోట్ల నిధులు ఉంచాలని,ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు.అధికారులు ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అక్కడికి వెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్,ఇరిగేషన్,విద్యుత్ శాఖ అధికారులు వేసవిలో కష్టమైనప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, అందుబాటులో ఉన్న నిధులతో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతే వెంటనే ఆ నిధుల ద్వారా పరిష్కరించాలని తెలిపారు. సమావేశం ప్రారంభమైన వెంటనే నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండ జిల్లాలోని తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ పరిస్థితులను సమావేశానికి వివరిస్తూ జిల్లాలో 1775 గ్రామాలు ఉన్నాయని, ప్రతిరోజు 140 ఎంఎల్‌డి తాగునీరు అవసరం ఉందని,విలీన గ్రామాలలో తప్ప ఎక్కడ సమస్య లేదని, అయితే తాగునీటి బోర్లు,చిన్న చిన్న మరమ్మతులకు అలాగే పైపులైన్ మరమ్మతులు తదితర వాటికి ఎస్‌డిఎఫ్ కింద పది కోట్ల 30 లక్షల రూపాయలు కావాలని, జిల్లాలో 26 సమయాత్మక గ్రామాలను గుర్తించినట్లు వెల్లడించారు. విద్యుత్ కు సంబం ధించి సమస్యలు లేవని,సబ్ డివిజన్ వారిగా సమీక్షించి 250 ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని గుర్తించడం జరిగిందని, 9 క్విక్ రెస్పాన్స్ టీం వాహనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఇఎన్‌సి హరిలాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, ఆయా విషయాలపై జరిగిన చర్చ సందర్భంగా వివరాలను తెలియజేశారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, అడిషనల్ కలెక్టర్ జె శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తోపాటు, జిల్లా అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



## కరీంనగర్-తిరుపతి రైలును ప్రతిరోజూ నడపాలి

### రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు మంత్రి పొన్నం లేఖ

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. కరీంనగర్ నుండి తిరుపతి వెళ్లే రైలును ప్రతిరోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. కరీంనగర్ టు తిరుపతి.. తిరుపతి టు కరీంనగర్‌కి తిరిగే రైలు ప్రస్తుతం వారానికి రెండు సార్లు మాత్రమే నడుస్తుందని తెలిపారు. ఈ రైలును తాను ఎంపీగా ఉన్న ప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్ళడానికి సులభతరంగా ఉంటుందని యూపీఏ ప్రభుత్వంలో ప్రారంభించినట్టు మంత్రి పొన్నం తెలిపారు. ఆ తరువాత ఈ రైలుని ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి కోరుతు న్నామని తెలి పారు. గత పదేళ్లుగా రైల్వే శాఖ మంత్రిగా మీకు, స్థానిక ఎంపీ బండి సంజ య్‌కి విజ్ఞప్తి చేయడం జరిగిందని పొన్నం కేంద్ర మంత్రికి రాసిన లేఖలో గుర్తు చేశారు. తిరు మల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు ఉత్తర తెలంగాణ నుండి తిరుపతి వెళ్లే వారి ప్రయాణికుల సమస్యలు తొలగించి.. కరీంనగర్ నుండి తిరుపతికి ప్రతిరోజూ రైలు నడిచేలా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

## కాంగ్రెస్ పాలన దేశవ్యాప్తంగా మెప్పు పొందడంతో..

# బిఆర్ఎస్, బిజెపిలకు మింగుడుపడటం లేదు

### కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ మార్కుపాలన దేశవ్యాప్తంగా చర్చజరిగేలా మెప్పు పొందుతుండటంతో బిఆర్ఎస్,బిజెపిలకు మింగుడు పడటంలేదని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ విమర్శించారు. శని వారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ అఖిలపక్ష మీటింగ్‌కు హాజరు కాకపోవడం పై బీజేపీ, బీఆర్ఎస్‌లపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై అఖిలపక్షం పెట్టాలని బిజెపి, బీఆర్ఎస్ లు గతంలో డిమాండ్ చేశాయని ఈరోజు ఎంపీల మీటింగు పెడితే రాలేదని ఆవేదన చెందారు. ఎంపిలతో మీటింగ్ కూడా అఖిలపక్షం లాంటిదే అని ఆయన భాష్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సహకారం కోసం ఎట్లా వ్యవహరించాలని పరిష్కారం కోసం ఎంపీల మీటింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. బిజెపి, బిఆరెస్ హాజరుకాలేదు. ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వం పట్ల బిజెపికి బీఆర్ఎస్ కు చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. మోడీ డైరెక్షన్‌లో నడిచే స్థాయికి బీఆర్ ఎస్ దిగజారిపోయిందని ఆయన ఎద్దేవాచేశారు. కేసీఆర్ ప్రతిపక్ష పాత్ర వదిలేసి ఔట్ సోర్సింగ్‌లో అల్లునికి, కొడుకుకి ఇచ్చిండు. రెండు పార్టీల డ్రామాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. సమావేశాన్ని ఎందుకు బైకాట్ చేశారో ప్రజలు అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ అన్నారు. బిజెపి బిఆర్ఎస్ పార్టీలకు ఓట్లు తప్ప ప్రజా సమస్యలు పట్టవు. బిజెపివేసే డ్రామాను బిఆర్ఎస్ వేస్తుంది. తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా చర్చకు రావడంతో బిఆర్ఎస్‌కు, బిజెపికి మింగుడు పడటంలేదు. ఒకడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండదని అం టడు. ఇంకొకడు ఎమ్మెల్యేలు ఉండరని అంటడు, రెండు పార్టీల నాయకులు ఈర్ష్యతో రాజకీయ కుట్రలు చేస్తున్నారు. గత ప్రభుత్వం లోని రావాల్సి న బిల్లుల కోసం కాంట్రాక్టర్లతో ధర్నాలు చేయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గరకు పాజి టివ్‌గా పోవాలని సిఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారపక్షం, ప్రతిపక్షాలు కలిసి పనిచేయాల్సి న అవసరం ఉందని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌గౌడ్, బండి సాయన్నగౌడ్ ప్రభాకర్‌గౌడ్ తదితరులు

## నీరాకేఫ్, భవనాన్ని తక్షణమే గీత కార్పొరేషన్‌కు అప్పజెప్పాలి

### గౌడజన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** నీరా కేఫ్ ఆనవాళ్లు లేకుండా టూరిజం శాఖ కుట్రలు చేస్తుందని నీరా కేఫ్‌తో పాటు భవనాన్ని వెంటనే కల్లుగీత కార్పొరేషన్‌కు అప్ప జెప్పాలని గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యెలికట్టే విజయ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నెక్లెస్ రోడ్ లోని నీరా కేఫ్ భవనంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ సమావేశంలో విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. గౌడ్‌ల ఆత్మ గౌరవంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు ఉండే విధంగా గత ప్రభుత్వం నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసిందని దాన్ని కొనసాగించాల్సి న అవసరం ఉందన్నారు. అయితే ఇటీవల కేఫ్ విషయంపై గౌడ సంఘాలు ఆందోళన చేస్తున్న సందర్భంలో నీరా కేఫ్ విషయంలో ఆందోళన చెంద వద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినా టూరిజం శాఖ దూకుడుగా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ టూరిజం శాఖ ఉన్నతాధికారి బినామీకి లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని భవనాన్ని అప్పజెప్తున్నారని ఆరోపించారు. బహిరంగ టెండర్లకు పిలవకుండా రహస్యంగా ఒప్పందాలు లావా దేవీలు అక్రమార్గంలో డబ్బులు దండు కోవడం కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నారని విమర్శించారు. నీరాకేఫ్ భవనంలో గౌడ కులస్తుల ప్రతిమలు తీసివేయడం చెట్లను నరికి వేయడం ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించిన శంకర్‌రెడ్డి టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళ బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి. ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో పాసైన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు సట్ కోటా కల్పించాలని అప్పుడే బి.సి. మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు శనివారం విద్యానగర్ బి.సి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు బి.సి మహిళ నాయకురాలు జాతీయ కన్వీనర్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగిస్తూ పార్లమెంటులో పాసైన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు జనాభా ప్రకారం సబ్‌కోటా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికీ మహిళ బిల్లు రాజ్యసభలో లోక్ సభలో కూడా ఆమోదం పొందింది. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నాం. బి.సి. లంటే చిన్న చూపా? బి.సి. సబ్ కోటా గురించి అసెంబ్లీ లో మొక్కుబడిగా తీర్మాణం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు. జనాభాలో సగం ఉన్న బి.సి. మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు.

మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్ల తో పాటు విద్యా ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్ల ను ప్రవేశపెట్టాలని కోరారు. రాజకీయ రిజర్వేషన్ల ను పెడితే 180 మంది మహిళలు పార్లమెంటులో సభ్యులవుతారన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, లతా, మంజువాణి, విజయలక్ష్మి, రేణుకా, జయంతి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న ప్రధాని మోడీ





మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ కె.లక్ష్మణ్, లంకల దీపక్‌రెడ్డి, భరత్‌గౌడ్ తదితరులు

### ఏ కాంగ్రెస్ ప్రధాని మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ధైర్యం చేయలేదు..

### 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు మోడీ తీసుకొచ్చారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** అన్నిరంగాల్లో ప్రధాని మోడీ మహిళలను ప్రోత్సహిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బిజెపి నగర కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ఏ కాంగ్రెస్ ప్రధాని కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ధైర్యం చేయలేదని, ప్రధాని నరేంద్రమోడీ మాత్రమే లోక్‌సభ, అసెంబ్లీలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేబిల్లు తీసుకొచ్చి ఆమోదింపజేశారని చెప్పారు. మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చేదేశం భారతదేశం. ఫైటర్ విమానాలు నడప డంలో, పైలట్లుగా, స్పేస్ టెక్నాలజీ రూపకల్పనలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. బ్యాంకుల్లో, పోలీసు రంగంలో, రెవెన్యూ, ఉపాధ్యా యులుగా, ఐటీ రంగంలో ఇలా ఏ రంగంలో చూసినా మహిళలు చాలా నమ్మకం, ధైర్యం, అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. ఆర్మీలోనూ మహిళలకు ప్రధాని మోడీ అవకాశం కల్పించారని, భగభగమండే ఎండలో, ఎముకలు కొరికే చలిలో కూడా దేశ సరిహద్దుల్లో ఎకె-47 పట్టుకుని మహిళా జవాన్లు పహారా కాస్తున్నారని చెప్పారు.

రాజకీయ రంగంలో కూడా మహిళలు ముందు ఉండాల్సి న అవసరం ఉందని, వార్డు మెంబర్ నుంచి పార్లమెంటు సభ్యుల వరకు రిజర్వే షన్లు కల్పించేందుకు ప్రధాని నరేంద్రమోడీ నడుం బిగించారని చెప్పారు. 'వ్యవసాయ రంగంలో మహిళలను పోత్సహించేందుకు డ్రోన్ దీదీ పథకం ద్వారా డ్రోన్లను అందించారు. రాజకీయ నాయకుల ఓటుబ్యాంకు రాజకీయాల కారణంగా ముస్లిం మహిళలకు అనేక హక్కులు ఉండేవి కావు. త్రిపుల్ తలాక్‌ను రద్దుచేసే ధైర్యం ఏ ప్రభుత్వం చేయలేదు. నరేంద్రమోడీ మాత్రం ధైర్యంగా ముందుకొచ్చి, త్రిపుల్ తలాక్‌ను రద్దుచేసి, ముస్లిం మహిళల కళ్లల్లో ఆనందం చూశారు. దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్‌ను రాష్ట్రపతిని చేసిన ఘనత బిజెపిది. గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత మోడీదే. మహిళలు ఎవరూ భయ పడొ ద్దని, గట్టిగా నిలబడాలనేదే ప్రధాని నరేంద్రమోడీ ఆకాంక్ష. దేశంలో మోడీ ప్రధానమంత్రి అయ్యాక ఉగ్రవాదం, తీవ్రవాదం అనే మాట వినిపించట్లేదు. ఆయన వచ్చాక జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతున్నారు. 370 అధికరణ తీసేశాం. ఎలాంటి ఘర్షణ లేకుండా అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన రామమందిరాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్నామన్నారు. పొదుపు సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తూ కేంద్రం మహిళలను ప్రోత్స హిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



## ఎఐ సాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

### ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** కృత్రిమ మేధస్సు(ఏఐ) సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'స్కిల్ డెవలప్‌మెంట్'లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. శనివారం సచివాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పిపిపి) విధానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఏఐ సిటీ'ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతుమన్నారు. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏఐ సాయంతో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ లో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఫౌండేషన్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన సందీప్ కుమార్ పుట్టిన ఊరిని మర్చిపోకుండా ఫౌండేషన్ తరఫున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు.

# నిమ్స్‌లో విజయవంతంగా గుండె మార్పిడి

### ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స.. కోలుకుంటున్న రోగి

### డాక్టర్లను అభినందించిన వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా

### అవయవదానంపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచన

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 8, ప్రభాతవార్త:** తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 యేళ్ల యువకుడికి, నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన మరో యువకుడి గుండెను, ఈ 19 యేళ్ల హైదరాబాద్ యువకుడికి విజయ వంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, డాక్టర్ అమరేశ్ బాబు నేతృత్వంలోని డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్ల బృందం శుక్రవారం శస్త్ర చికిత్సను పూర్తి చేసింది. హైదరాబాద్ కు చెందిన పూజారి అనిల్‌కుమార్ కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. నిమ్స్ హాస్పిటల్‌లో హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం జీవన్ దాన్‌లో రిజిస్టర్ చేసుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన 24 ఏండ్ల యువకుడు, హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. అతని కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఆ యువకుని బ్లడ్ గ్రూపునకు, అనిల్‌కుమార్ బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అయింది. దీంతో హార్ట్‌ను నిమ్స్‌కు తరలించి, డాక్టర్ అమరేశ్ బాబు నేతృత్వంలోని టీమ్ అనిల్‌కుమార్‌కు అమర్చింది.

ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా అవయవమార్పిడి చికిత్స చేశామని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప వివరించారు. నిమ్స్‌లో గతేడాది 62 మందికి కిడ్నీ, నలుగురికి లివర్, ఇద్దరికి హార్ట్, ఒకరికి లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేశామని, ఈ ఏడాది 16 మందికి కిడ్నీ, ఒకిరికి లివర్, ఒకరికి హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేశామన్నారు. ( 2024, 2025లో కలిపి మొత్తం 87 ట్రాన్స్‌ప్లాంటేషన్లు)గతేడాది నిమ్స్‌లో ఒక వ్యక్తికి హార్ట్, లంగ్ రెండూ ఒకేసారి ట్రాన్స్‌ప్లాంట్ చేశామని బీరప్ప తెలిపారు.

దేశంలోని ప్రభుత్వ దవాఖాన్లలో, ఒక్క నిమ్స్‌లో మాత్రమే ఇలా ఒకేసారి హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. నిమ్స్ డాక్టర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అవయవమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కూడా పేషెంట్ల బాగోగులను పర్యవేక్షించాలని, వారికి అవసరమైన వైద్య సేవలను కొనసాగించాలని ఆయన సూచించారు. నిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించాలని, ఇందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గాంధీ హాస్పిటల్‌లో త్వరలోనే అధునాతన ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. యువకుడికి గుండెను దానం చేసిన డోనర్ కుటుంబసభ్యులను మంత్రి అభినందించారు.

మరొకరికి పునర్జన్మను ప్రసాదించే అవయవాలను మట్టిలో వృథాగా కలిసిపోనియొద్దన్నారు.అవయవదానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జీవన్‌దాన్ ఇంచార్జ్, డాక్టర్ భూషణ్ రాజు మంత్రి సూచించారు.అవయవ మార్పిడి విషయంలో అవకతవకలకు పాల్పడే ప్రైవేటు హాస్పిటళ్లపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు.అవయువదానానికి సంబంధించిన కొత్త నిబంధనలను అమలు చేయబోతున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అవయవాల అక్రమ రవాణా, సేకరణ, మార్పిడికి కఠిన శిక్షలు పడేలా కొత్త నిబంధనలు ఉండబోతున్నాయన్నారు.



### అత్యవసర గుండెమార్పిడి కోసం నగరంలో గ్రీన్‌ఛానల్ ఏర్పాటు

అత్యవసర గుండె మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగి కోసం ఎల్బీ నగర్‌లోని కామినేని హాస్పిటల్ నుండి జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు కాడవర్ హార్ట్‌ను గ్రీన్ కారిడార్ ద్వారా తీసుకువచ్చారు!జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్, జీవన్‌ధన్ తెలంగాణ సహకారంతో, గ్రీన్ ఛానల్ ఉపయోగించి నాగోల్ నుండి జూబ్లీహిల్స్‌కు మెట్రో రైలు ద్వారా గుండెను రవాణా చేయడానికి వీలు కల్పించడంతో సమయానికి చేరుకోవడం జరిగింది. ప్రాణాలను కాపాడే మార్పిడి కోసం సకాలంలో అవయవ డెలివరీ యొక్క ప్రాముఖ్యతను ఈ ప్రయత్నం నొక్కి చెబుతుంది.కామినేని హాస్పిటల్ నుండి ప్రారంభమై రాత్రి 07:45 గంటలకు అంబులెన్స్ ద్వారా మెట్రో నాగోల్కు రాత్రి 08:00 గంటలకు తీసుకువచ్చారు. గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయడంతో సకాలంలో ఆసుపత్రికి చేరుకోవడం జరిగింది. 49 సంవత్సరాల రైతులు ఇంట్లో తలతిరిగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించినా ప్రయోజనం లేకపోయింది.దీంతో అవయవ దానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. అదే సమయంలో 44 సంవత్సరాల పురుషుడు, వ్యాపారం, వివాహితుడు, 3 మంది పిల్లలు.: తీవ్రమైన ఎల్వీ పనిచేయకపోవడం గుండె వైఫల్యంతో డైలేటెడ్ కార్డియోమయోపతికి గురయ్యాడు.ఫిబ్రవరి 19 నుండి అతని పరిస్థితి మరింత దిగజారి రెండుసార్లు అడ్మిట్ అయింది.శుక్రవారం అతన్ని డిశ్చార్జ్ చేశారు, మళ్ళీ శనివారం అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఇంట్యూబేట్ చేయించుకున్నారు.

మార్పిడి చేయకపోతే అతను బ్రతకలేడని డాక్టర్‌లు నిర్ధారించారు. దీంతో రైతు కు సంబంధించిన అవయవం జీవన్‌ధాన్ ద్వారా అతనికి అమర్చే ప్రయత్నం విజయవంతంగా జరిగింది. అయితే నగరంలో విపరీతమైన ట్రాఫిక్ కారణంగా గుండె ఆసుపత్రికి చేరే సమయానికి కనీసం 5 నుండి 6 గంటలు పడుతుంది, అయితే వ్యవధి గ్రహీత పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. దీంతో గ్రీన్‌ఛానల్ ద్వారా సకాలంలో జూబ్లీహిల్స్‌లోని ఆసుపత్రికి తీసుకువచ్చారు.

## 33 సెలక్షన్ గ్రేడ్ కలెక్టర్ పోస్టులకు త్వరలో జిఓ జారీ

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ పోస్టులకు త్వరలో ప్రభుత్వం జీవో జారీ కానుంది. సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ మొదలు పెట్టేందుకు మార్గం సుగమం అయింది. సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ 33 పోస్టులను ఆమోదిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రెవెన్యూ శాఖలో ఒక కొత్త అధ్యాయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారం భించారని ఆయన కొనియాడారు. చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ దశాబ్దాలుగాగా డిమాండ్ చేస్తున్న ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిష్కరించారని కృతజ్ఞతలు తెలిపారు.

# సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తీసుకురండి



## వ్యవసాయ మార్కెట్ల ద్వారా విక్రయించండి

## రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ సబ్‌కమిటీ

## సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:** సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలని, ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ప్రారంభించినట్టు.. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ల లోనూ ఇసుకను అందుబాటులోకి తీసుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శనివారం ప్రజాభవన్‌లో రెవెన్యూ రిసోర్స్ మొబైల్ జేషన్ సబ్ కమిటీ సమావేశం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరగగా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాలకు ఉద్దేశించిన ఇసుక, మైన్స్ శాఖలను అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా వివరించారు. ఇసుకకు సంబంధించి ఐటీడీఏలతో త్వరగా ఒప్పందం చేసుకోవాలని మంత్రులు సూచించారు.

ఆదాయం ఆర్జించే శాఖల్లో లూ పోల్స్ అరికట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు సాధించాలని మంత్రులు సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకునే లక్ష్యాలు వాస్తవానికి దగ్గరగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో కాలుష్య కారకమైన పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు దాటించాలని గతంలోని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని వేగవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్యాబినెట్ సబ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు ప్రతినెల ప్రగతిని సమీక్షించాలని, ఆ ప్రగతి వివరాలను ప్రతి మూడు నెలలకు క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించాలని ఆదేశించారు.

# విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యం

## జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమన్నారు తెలంగాణ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క. ఆడ పిల్లలు చదువుకుంటేనే అన్ని రంగాల్లో ముందుకు వెళ్తారని... అప్పుడే సమాజంలో మహిళలపట్ల నెలకొన్న అసమానతలను రూపుమాప గలుగుతామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక రూపొందించిన గోడ పత్రికను సచివాలయంలో మంత్రి శనివారం ఆవిష్కరించారు. హిందీ రచయిత్రి కమలా భాసిన్ రాసిన కవిత.. "నేను ఆడపిల్లను అందుకే తప్పక చదవాలి" పేరుతో జన విజ్ఞాన వేదిక తెలుగులోకి అనువదించి గోడ పత్రిక ముద్రించింది.

ఈ వాల్ హ్యాంగర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక, సమతా విభాగం సభ్యులు మంత్రి సీతక్కకు వాల్ హ్యాంగర్‌ను బహూకరించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో దీన్ని కరపత్రాలుగా పంపిణీ చేయనున్నట్లు వారు మంత్రికి తెలిపారు. ఆడపిల్లల్లో చదువు పట్ల అవగాహన పెంచేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని మంత్రి సీతక్క కొనియాడారని.. ఈ విషయంలో తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారని వేదిక నాయకులు తెలిపారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని అధిగమిస్తేనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని సమతా విభాగం నాయకురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మీ తెలిపారు. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంఘాలు కృషి చేయాలన్నారు.

# సవాళ్లను ఎదుర్కొని మహిళలు ముందుకువెళ్తున్న తీరును అంతా స్ఫూర్తిగా తీసుకోవాలి

## బిజెపి కార్యాలయంలో మహిళా దినోత్సవాలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** మహిళలు సవాళ్లను ఎదుర్కొని ముందుకు వెళ్తున్న తీరును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే దేశం భారత దేశమని, ఫైటర్ విమానాలు నడపడంలో, పైలట్లుగా, స్పేస్ టెక్నాలజీ రూపకల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. శనివారం బిజెపి నగర కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళల సమస్యలను అధిగమించి, మహిళా సమాజాన్ని ఎలా ప్రోత్సహించాలనే అంశంపై ప్రపంచం ముందుకు వెళ్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి జాతీయాధ్యక్షుడు జెపి నడ్డా పిలుపు మేరకు దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నా అన్నారు. మహిళలు బ్యాంకుల్లో, పోలీసు రంగంలో, రెవెన్యూ, ఉపాధ్యాయులుగా, ఐటి రంగంలో ఇలా ఏ రంగంలో చూసినా మహిళలు చాలా నమ్మకంతో, ధైర్యంతో, అంకిత భావంతో పనిచేస్తున్నారని, హైదరాబాద్‌లో లక్షలాది మంది ఆడబిడ్డలు ఐటి రంగంలో కీలక పాత్రపోషిస్తున్నారన్నారు. ఏ కాంగ్రెస్ ప్రధాని కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ధైర్యం చేయలేదని, కానీ ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమే లోక్ సభ, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు తీసుకొచ్చి ఆమోదింపజేశారన్నారు. అన్ని విషయాల్లో కూడా ప్రధాని మోడీ మహిళలను ప్రోత్సహిస్తున్నారు. మరో సారి రాష్ట్రపతిని చేయాల్సిన అవకాశం వచ్చినప్పుడు దళిత సామాజిక వర్గానికి చెందిన రామ్ నాథ్ కోవింద్‌ను, మూడోసారి గిరిజన మహిళను దేశ రాష్ట్రపతిగా చేసిన ఘనత నరేంద్ర మోడీ అన్నారు. మహిళలు ఎవరూ భయపడొద్దని, గట్టిగా నిలబడాలనేదే ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష. ఆడ బిడ్డలందరికీ అండగా నిలబడతానని ఆయన మాటిచ్చారు. వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తున్నారు. దేశం మొత్తం శాంతి భద్రతలు ఉన్నాయి.

# కెసిఆర్! మీ తప్పులు మాఫీచేసే అక్షయ పాత్ర ఇక్కడలేదు

## భువనగిరి ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 8,ప్రభాతవార్త:** పదేళ్ల దౌర్భాగ్య పాలన ఫలితంగానే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనకంటున్నారని, కెసిఆర్...! మీ తప్పులు మాఫీ చేసే అక్షయ పాత్ర ప్రభుత్వం లేదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో శనివారం మాట్లాడుతూ ఊహాగానాల తో ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన చెందారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉందని గత ప్రభుత్వం కేంద్రంతో సత్సంబంధాలు లేకపోవడం వల్లే రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాలేదని ఆరోపించారు. వీటిని పరిష్కరించేందుకు అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ప్రజా పాలన లో ప్రజలు మంత్రులను స్వేచ్ఛగా కలిసే అవకాశం ఉంది. గతంలో మాదిరి మేము ఎవరిని అడ్డుకోవడంలేదని ఆయన తెలిపారు. కేసీఆర్ ఫాం హౌస్ లో కార్యకర్తల తో మాట్లాడుతూ ఓపిక నశించిందని వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని దీనికి కారణం గత ప్రభుత్వ అవినీతి మాత్రమే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ను అసెంబ్లీ కి వచ్చి ఎండగడుతా అని అంటున్నాడని మేము కూడా మేము కూడా కెసిఆర్ రాక కోసం వేచి చూస్తున్నాం అని ఆయన తెలిపారు.. బిజెపి కేంద్రమంత్రిని ముగ్గురు రాష్ట్రమంత్రులతోపాటు ఇద్దరం ఎంపిల కూడా కలిశామని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై ఆయనకు సవివరంగా నివేదికలు అందిచామని తెలిపారు. ఆర్‌అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో మంత్రులు సీతక్క, కొండసురేఖ, ఎంపి కడియం కావ్యలు వెళ్ళి కలిశామని తెలిపారు.

# కాజీపేట డివిజన్, కొత్త రైల్వే లైన్లను మంజూరు చేయండి



## నల్లగొండ జిల్లా లెవల్‌క్రాసింగ్‌లకు ఆర్‌వోబి ఆర్‌యుబిలు నిర్మించాలి

## రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


**హైదరబాద్, మార్చి 8,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లను మంజూరు చేసి, కేంద్రం ప్రభుత్వం రైల్వే నిధులతో నిర్మించాలనీ, కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య లు, శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టులో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి విన్నవించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కాజీపేటలో కొనసాగుతున్న రైల్వే కోచ్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల వేగం పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంతో దక్షిణ మధ్య రైల్వే పరిధి సికిందరాబాద్, హైదరాబాద్, నాందేడ్ జోన్లుగా కుదించబడ్డాయనీ కాజిపేట్ డివిజన్ ఆవశ్యకత కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి వివరించారు. ఆర్థికంగా ఇబ్బంది లేని ఈ రైల్వేలైన్‌ను నిర్మిస్తే సరుకు రవాణా మార్గంగా ఉపయోగకరంగా ఉండబోతున్నందుని చెప్పారు. ఈ కొత్త రైల్వే లైన్లు మంజూరు వల్ల రాష్ట్రంలోని వెనుకబడిన, మారుమూల ప్రాంతాలలో నివసించే ప్రజల సామాజికఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి దోహదం చేస్తుందని కేంద్రమంత్రికి వివరించారు.

# రన్యారావు కేసుతో రంగంలోకి సిబిఐ

**బెంగళూరు, మార్చి 8:** బంగారం స్మగ్లింగ్‌కేసులో కన్నడనటి రన్యారావుకు మరింత సమస్యలు ఎదురయ్యాయి. ఈకేసును కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ టేకోవర్‌చేసింది. దేశంలోని వివిద విమానాశ్రయాల ద్వారా విదేశాలనుంచి దేశంలో అక్రమంగా బంగారం తరలించిన స్మగ్లర్లపై కన్నేసింది. రన్యారావు స్మగ్లింగ్ వెలుగులోకి రావడంతో మరిన్ని స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లు అక్రమంగా భారత్‌కు బంగారం తరలించే అవకాశాలపై సిబిఐని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అప్రమత్తంచేసింది. దుబాయినుంచి బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన రన్యారావును గత సోమవారం రాత్రి డిఆర్‌ఐ అధికారులు అరెస్టుచేసి ఆమెనుంచి 14.2 కిలోల అక్రమబంగారం స్వాధీనం చేసుకున్నారు. తరచూ దుబాయి, అమెరికా, యూరప్ వెళ్లేదానినని డిఆర్‌ఐ విచారణలో రన్యారావు అంగీకరించింది. రన్యారావువెనుక అక్రమ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించే కోణంలో డిఆర్‌ఐ ఆరాతీస్తోంది. కేసు విచారణకు డిఆర్‌ఐ సహకారంతో సిబిఐ రంగంలోకి దిగింది. రెండు టీమ్‌లను ఇప్పటికే బెంగళూరు, ముంబయి విమానాశ్రయాలకు పంపించింది. విమానాశ్రయాల్లో వీరికి అందుతున్న సహకారంపైనా సిబిఐ ఫోకస్‌పెడుతోంది. కస్టమ్స్, పోలీస్ విమానాశ్రయ అధికారులతోసహా ప్రభుత్వ అధికారుల ప్రమేయంపై ఆరాతీస్తున్నది. సిబిఐ రన్యారావును కస్టడీలోకి తీసుకునే ఛాన్స్‌కూడా ఉందని పోలీస్ వర్గాలే చెపుతున్నాయి.

# సచివాలయ సందర్శన వేళలపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సచివాలయ సందర్శన వేళలను పెంచేలా అదేశం ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలన్న విన్నపంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫిర్యాదుల స్వీకరణ కోసం సచివాలయ ప్రధాన ద్వారం వద్ద ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు సందర్శన సమయాన్ని పెంచాలని కోరుతూ ప్రజాహిత వ్యాజ్యం దాఖలవడంతో హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం ఈ నోటీసులు జారీ చేసింది.



# సిరియాలో మళ్లీ మాజీ అధ్యక్షుడు బషేర్ విధేయుల తిరుగుబాటు

**డమాస్కస్, మార్చి 8:** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ విధేయుల తిరుగుబాటుతో స్థానికంగా మళ్లీ హింసచెలరేగింది. భద్రతా బలగాలు, అసద్ అనుకూల వాదులమధ్య తీవ్రఘర్షణలు ప్రతీకార దాడులు చోటుచేసుకున్నాయి. గడిచిన రెండు రోజులుగా జరుగుతున్న దాడుల్లో సుమారు 600 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. సిరియా అంతర్యుద్ధం మొదలైన తర్వాత అత్యంత ఘోరమైన హింసాత్మక ఘటన ఇదేనని చెపుతున్నారు. అధికారంనుంచి బషర్ అసద్ వైదొలిగిన మూడునెలల అనంతరం సిరియాలోఘర్షణలు తలెత్తాయి. అసద్ మద్దతుదారుల దాడులకు తీవ్రంగా ప్రతిస్పందిస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. ఈ క్రమంలోప్రభుత్వ అనుకూల ఫైటర్లు, అసద్ విధేయులైన అలవైట్‌వర్గంపై ప్రతీకార దాడులు ప్రారంభించడంతో తీవ్ర హింసకు దారితీసింది. రెండువైపులా దాడుల్లో వందలాదిమంది ప్రాణాలు వదిలారు. బనీయాస్ పట్టణంలో చోటుచేసుకున్న హింసలోనూ అనేకమంది చనిపోయారు. వీధులు భవనాలపైనా మృతదేహాలు పడి ఉన్నట్లు స్థానికులు వెల్లడించారు. వాటిని తీసుకునేందుకు కూడా ఎవ్వరూ సాహసంచేయడంలేదని ఖననంచేయకుండా గన్‌మెన్‌లు అడ్డుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తంచేసారు.

# రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో టోకెన్ సమ్మె

## యూరియా లోడింగ్‌కు ఆటంకం

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో కార్మికులు టోకెన్ సమ్మె చేశారు. వేతనాల విషయంలో చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్న కార్మికులు ఆందోళనల్లో భాగస్వామ్యు లయ్యారు. ఉదయం గేటు వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో కార్మికులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తుండడంతో ఎన్టీపీసీ పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఎస్ఐ కార్మికులతో మాట్లాడారు. పరిశ్రమ గేట్ వద్ద ఆందోళ నలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఇక రంగంలోకి రోబోలు?

## 14రోజులుగా కానరాని కార్మికులు జాడ

## టిబిఎం మిషన్ శకలాలు తొలగింపు..

## ఇది ఒక జాతీయ విపత్తు..

## సహాయక చర్యల పురోగతిపై తిరిగి ఎల్లుండి సమీక్షిస్తాం..

## నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 8, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనిపెట్టేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గురు, శుక్రవారం కేడవర్ డాగ్స్‌ను టన్నెల్‌లోకి పంపడం, అవి 8ప్రదేశాలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాంతాల్లో తవ్వకాలు జరపడం అసాధ్యంగా మారిందని నిపుణులు చెబుతున్నారు. మట్టి తోడివేత నిరంతరంగా జరుగుతున్నా మళ్లీ కొత్తంగా బురద, నీరు రావడంతో చాలా క్లిష్టంగా మారినట్లు నిపుణుల బృందం చెబుతున్నది. దీంతో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి రోబోల సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. ఈక్రమంలో శనివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇదే విషయమై క్లారిటీ ఇచ్చారు.

**ఇది జాతీయ విపత్తు..**

ఎస్‌ఎల్‌బీసీ సహాయక చర్యల్లో రోబోలను వెంటనే రంగంలోకి దింపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట ఎస్.ఎల్.బి.సి. లో జరిగిన ప్రమాద సంఘటన ఒక జాతీయ విపత్తు అని సొరంగం లో చిక్కుకున్న కార్మికులను రక్షించడానికి, సహాయక చర్యలలో ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకుంటు న్నామని ఆయన తెలిపారు. శనివారం ఉదయం అచ్చంపేట శాసన సభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణతో కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దోమల పెంట ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ను సందర్శించి వివిధ రంగాల నుంచి పనిచేస్తున్న రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు ఇప్పటి వరకు జరిగిన పురోభివృద్ధి పై రెస్క్యూ ఆపరేషన్ ను పర్యవేక్షణ చేస్తున్న రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్మీ కమాన్డెంట్ పరిక్షిత్ మెహ్రా మంత్రికి వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ లో పనిచేసే కార్మికులు, అధికారులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరగా కార్మికులను గుర్తించేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. ఎంత నిధులు ఖర్చు అయిన సరే ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సమీక్ష సమావేశంలో స్థానిక శాసన సభ్యులు డా. వంశీకృష్ణా, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ డోగ్రా రెజిమెంట్ కమాండెన్ట్ పరిక్షీత్ మెహ్రా తదితర రంగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి తీరని అన్యాయం

## సీట్లు తగ్గే అవకాశమున్న రాష్ట్రాలకు రక్షణ కల్పించాలి

## సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** దేశంలో లోక్ సభ నియోజకవర్గాల పునర్వి భజన ప్రక్రియలో అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం జరిగే విధంగా సీట్ల సంఖ్య ఉండాలని.. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు. అమెరికా సెనెట్ తరహా రాష్ట్రాల సభగా పిలవబడే రాజ్యసభకు.. లోక్‌సభతో సమాన అధికారాలు కల్పించాలన్నారు. 2026లో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ఖాయమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో జనాభా ప్రతిపాదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగునుందని వ్యక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకుండా రక్షణ కల్పించాలని, అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం జరిగే విధంగా పునర్విభజన ఉండాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో శనివారం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన- దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన వహించగా.. సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ఐఎల్ జాతీయ అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ఆర్థిక నిపుణులు కె.పాపారావు, న్యాయవాది కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఛాంపియన్స్‌ట్రోఫీ ఫైనల్‌మ్యాచ్

## రూ.5 వేల కోట్ల బెట్టింగ్ టర్నోవర్

## ఐదుగురిని అరెస్టు చేసిన ఢిల్లీపోలీసులు

## బెట్టింగ్ మాఫియాకు దుబాయితో లింకులు

**న్యూఢిల్లీ, మార్చి 8:** ఛాంపియన్స్‌ట్రోఫీలో న్యూజిలాండ్ భారత్‌జట్లమధ్య జరిగే ఫైనల్‌మ్యాచ్‌లో భారీ మొత్తంలో బెట్టింగ్‌లు కడుతున్నారు. ఇందుకోసం బడా మాఫియా బృందాలే రంగంలోకి దిగాయి. కొన్ని ప్రత్యేక యాప్‌లు కూడా కేవలం ఈ ఫైనల్‌మ్యాచ్‌కోసం రూపొందించారు. అంతర్జాతీయ బుకీలకోసం ఇపుడు ఈఛాంపియన్స్‌ట్రోఫీ ఫేవరేట్‌గా మారింది. అండర్‌వరల్డ్‌డాన్ దావూద్ ఇబ్రహీం డికంపెనీ కూడా ఇలాంటి పెద్దక్రికెట్ మ్యాచ్‌లలో బెట్టింగ్ నిర్వహిస్తుందని దర్యాప్తుల్లో తేలింది. కనీసం ఐదుగురు పెద్ద బుకీలను ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఢిల్లీ పోలీస్‌క్రైమ్‌బ్రాంచ్ అరెస్టులుచేసింది. వారిని విచారించగా మొత్తం ఫైనల్‌మ్యాచ్‌కోసమే సుమారు ఐదువేల కోట్ల మొత్తం టర్నోవర్‌తో బెట్టింగ్ జరుగుతున్నట్లు తేలడంతో ఇపుడు దర్యాప్తు మొత్తం దుబాయికి మారింది. ఒక కేసులో ఇద్దరు బుకీలను కూడా గుర్తించారు. వీరు పర్వీన్‌కొచ్చర్, సంజయ్‌కుమార్‌లుగా వారిని గుర్తించారు. ఇండియా ఆస్ట్రేలియా ఛాంపియన్స్‌ట్రోఫీ సెమీఫైనల్‌మ్యాచ్‌కోసం వీరు బెట్టింగ్‌లు నిర్వహించారని తేలింది. వీరిద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లాప్‌టాప్‌లు, మొబైల్‌ఫోన్లలో లైవ్‌బెట్టింగ్ నిర్వహించడం గమనించిన పోలీసులు వీరినుంచి కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా స్వాధీనంచేసుకున్నారు. లక్కీడాట్‌కామ్ అనే బెట్టింగ్ వైబ్‌సైట్‌నుంచి మాస్టర్ ఐడిని సాధించిన పర్వీన్ కొచ్చర్ బెట్టింగ్ ఐడిలను సృష్టించి వారిని పంటర్లకు విక్రయిస్తున్నట్లు తేలింది. ప్రతి లావాదేవీపైనా ఈ సిండికేట్ మూడుశాతం ఛార్జిలు వసూలుచేస్తుంది. ఆఫ్‌లైన్ బెట్టింగ్‌కోసం నిందితులు ఫోన్‌కాల్స్‌ద్వారా బెట్టింగ్‌నిర్వహించి ఒక నోట్‌పాడ్‌లో ఎంట్రీలు వేస్తారు.

బెట్టింగ్‌రేట్ల ఆధారంగా ఆఫ్‌లైన్ బెట్టింగ్ కొనసాగుతుంది. గడచిన రెండేళ్లుగా పర్వీన్‌కొచ్చర్ నెలకు 35వేల వంతున అద్దెచెల్లిస్తూ ఇంటిని తీసుకున్నాడు. ప్రతి మ్యాచ్‌రోజున ఆతడికి 40 వేల లాభం వచ్చినట్లు తేలింది. మరింతగా ప్రశ్నించడంతో ఆతని మొత్తం నెట్‌వర్క్ దుబాయినుంచి కొనసాగుతున్నట్లు తేలింది. ఇక బిగ్‌బుకీలు పరంగాచూస్తే ఛోటు బన్సాల్ వెస్ట్‌ఢిల్లీకి చెందినవారు. కెనడాలో ఒక బెట్టింగ్‌యాప్ డెవలప్‌చేసాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాడు. ఆతనియాప్‌ను ఇతరులు లీజుకు తీసుకుని బెట్టింగ్ కొనసాగిస్తారు. ఇక ఢిల్లీలోని మోతీనగర్‌కు చెందిన వినయ్‌కూడా ప్రస్తుతం దుబాయ్‌లోనే ఉన్నాడు. క్రికెట్ గ్రౌండ్‌ఋంచే ఫీడ్‌బ్యాక్ అందిస్తుంటాడు. మరికొందరు ఢిల్లీకి చెందినవారే బాబీ, గోలు, నితిన్‌జైన్, జీతులుగా ఈ మాఫియా సభ్యులని తేలింది. ఢిల్లీలో అరెస్టుచేసిన ఐదుగురిలో మనిశ్ సహాని, యోగేశ్ కుకేజా, సూరజ్‌లకు దుబాయితో లింకులున్నాయి. పోలీసులు వీరినుంచి 22



లక్షల నగదును కూడా స్వాధీనంచేసుకున్నారు.

ఈ గ్యాంగ్ మెయిన్ ఆపరేటర్‌గా మనీశ్ సహాని కొనసాగుతున్నాడు. బెట్టింగ్‌లో పాల్గొనే వారి వాయిస్‌లు రికార్డుచేసి లావాదేవీలునిర్వహిస్తాడు. బ్యాంకు ఖాతాలు లేదా నగదురూపంలోనే లావాఏవీలుంటాయి. తనవరకూ ఎలాంటి మద్యవర్తులు దళారిలను నియమించలేదని, తనకు తానుగానే ఈ మొత్తం బెట్టింగ్‌కార్యకలాపాలు నిర్వహిస్తానని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. ఇంటరాగేషన్‌లో ముగ్గురునిందితులు మన్ను మట్కా, అక్షయ్ గెహ్లోత్;నిషు, రింకు, అమన్‌రాజ్‌పుత్‌లు సట్టా పేరిట ఒక బెట్టింగ్‌యాప్‌ను భారత్ బయట రూపొందించి ఇతరులకు లీజుకిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు రాబట్టారు.

# ఉగ్రవాదుల కార్ఖానాలకు స్వర్గధామంగా పాక్

## గ్లోబల్ ఇండెక్స్ 2025లో రెండో స్థానం, ఆసియాలో మొదటి స్థానం

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** ఉగ్రవాదులను తయారు చేయడంలో, వారి కోసం స్థావరాలను ఏర్పాటు చేయడంలో దాయాది దేశం పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపి) గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ అనే సంస్థ 2025 పరిశోధనలో ద్వితీయ స్థానంలోనూ ఆసియా ఖండంలో మొదటి స్థానంలోనూ నిలిచిం ది. ఈ సంస్థను గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌గా కూడా పిలుస్తారు. భారత్‌లోకి నిత్యం ఉగ్రవాదులను పంపుతున్న దేశంగా పేరొందిన పాకిస్తాన్ ఇప్పుడు దాని కారణంగా స్వదేశంలోనూ నిత్యం తీవ్రంగా నష్ట పోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో వున్న ఉగ్రవాదం, అక్కడ టెర్రరిస్టుల కోసం వున్న కార్ఖానాలపై పరిశోధనలు చేసే గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2025 ఏడాదికిగానూ పాకిస్తాన్‌కు ప్రపంచంలో ద్వితీయ స్థానాన్ని ఇచ్చింది. మొదటి స్థానంలో ఆఫ్రికా దేశం బుర్కినాఫోసో వుంది. పాకిస్తాన్‌లో ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి సంఖ్య 2023తో ఏడాదితో పోలిస్తే 2024లో 45 శాతం పెరిగి 108 1కు చేరిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇన్‌స్టి ట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపి) గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ అనే సంస్థ ప్రతీయేటా ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా సాగే దేశాలపై పరిశోధన చేస్తుంది. ఈ సంస్థ విడుదల చేసే నివేదికలో అంతకు ముందు 17 ఏళ్ల నాటి వివరాలను కూడా పొందుపరుస్తుంటుంది. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా వున్న 163 దేశాలకు ర్యాంగ్ ఇచ్చింది. ఇందులో ఉగ్రవాద ఘటనలు, దీనివల్ల సంభవించిన మరణాలు, గాయబడ్డ వారు, బందీల సంఖ్యను ఈ సంస్థ పరిగణలోకి తీసుకుని ఆయా దేశాలకు ర్యాంకులు ఇస్తుంది. గ్లోబల్ ఇండెక్స్ 2025కు సంబంధించి విడుదల చేసిన నివేదికలో పాకిస్తాన్ ప్రపంచ ంలోనే ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా వున్న దేశాలలో రెండవదిగా నిలిచింది. కాగా ఉగ్రవాద కార్యకలాపాల వల్ల పాక్ ప్రజలు కూడా బాధితులుగా మారడం బా ధాకరమని ఆ సంస్థ పేర్కొంది. 2023లో పాక్‌లో 517 ఉగ్రదాడులు జరగ గా 2024 నాటికి ఇది 1099కు పెరిగాయని గ్లోబల్ ఇండెక్స్ వెల్లడించింది. ఉగ్రవాద దాడులను నమోదు చేస్తున్న దేశాల సంఖ్య 2024 నాటికి 58 నుంచి 66కు పెరిగింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2024లో ఆరు దేశాలు కొత్తగా చేరాయి. ఉగ్రవాద దాడుల కారణంగా 45 దేశాల పరిస్థితి దారుణంగా వుందని గ్లోబల్ ఇండెక్స్ సంస్థ పేర్కొంది. ఇదే సమయంలో గతంతో పోలిస్తే 34 దేశాల పరిస్థితి కొంత మేర మెరుగుపడింది. 2024లో నాలుగు ఉగ్రవాద సంస్థల కారణంగా అమాయకుల మరణాలు 11 శాతం పెరిగాయి. మొత్తం మీద ఉగ్రవాద కార్యకలాపాలలో బుర్కినా ఫాసో 8581 స్కోరుతో మొదటి స్థానం, 8374 స్కోరుతో పాకిస్తాన్ ద్వితీయ స్థానంలో వున్నాయి. దీని తరువాత సిరియా మూడవ స్థానం, మాలి నాలుగవ స్థానం, నైజర్ ఐదవ స్థానం, నైజీరియా, సోమాలియా, ఇజ్రాయిల్, ఆఫ్ఘనిస్తాన్, కామెరూన్ తరువాతి స్థానాల్లో నిలిచాయి.



# జూ. చెస్ వరల్డ్ ఛాంపియన్‌గా ప్రణవ్

**న్యూఢిల్లీ:** ఇండియా యంగ్‌స్టర్ ప్రణవ్ వెంకటేశ్ వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్ (అండర్ 20)గా నిలిచాడు. ఈ ఘనత సాధించిన నాలుగో ఇండియన్‌గా రికార్డుకెక్కాడు. మోంటెనెగ్రో దేశంలోని పెట్రోవాక్‌లో జరిగిన చివరి, 11వ రౌండ్‌లో స్లొవేనియాకు చెందిన మాటిక్ లావ్రెన్సిక్‌తో గేమ్‌ను 18 ఎత్తుల్లోనే డ్రా చేసుకొని టైటిల్ నెగ్గాడు. టోర్నీలో మొత్తంగా ఏడు విజయాలు, నాలుగు డ్రాలతో 11 పాయింట్లకు గాను అత్యధికంగా 9 పాయింట్లు కైవసం చేసుకున్నాడు. గతేడాది చెన్నై ఇంటర్నేషనల్ టోర్నీలో విజేతగా నిలిచిన 17 ఏండ్ల ప్రణవ్ ఇండియా చెస్ లెజెండ్ విశ్వనాథన్ ఆనంద్‌కు చెందిన వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నాడు. 1987లో ఇదే టోర్నీలో టైటిల్ నెగ్గిన ఆనంద్ తన రాకను ఘనంగా చాటుకున్నాడు. ఆ తర్వాత హరికృష్ణ (2004), అభిజీత్ గుప్తా (2008) కూడా వరల్డ్ జూనియర్ చాంపియన్లుగా నిలిచారు. ఇప్పుడు 17 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రణవ్ ఈ టైటిల్ గెలిచాడు.

ఆట



# మాస్టర్స్ చెస్ ఛాంపియన్‌గా అరవింద్

**న్యూఢిల్లీ:** చెక్ రిపబ్లిక్ వేదికగా జరిగిన ప్రేగ్ మాస్టర్స్ చెస్ చాంపియన్‌షిప్‌ను భారత యువ గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదంబరం గెలుచుకున్నాడు. 25 ఏళ్ల ఈ యువకుడు తొమ్మిది రౌండ్లలో ఆరు పాయింట్లు సాధించి స్వదేశీయుడు ఆర్ ప్రజ్ఞానందతో సహా ఎలైట్ ఆటగాళ్లను అధిగమించాడు. చివరి రౌండ్‌లో, అరవింద్ టర్కీకి చెందిన గురెల్ ఎడిజ్‌ను డ్రాగా ముగించాడు, వ్యూహాత్మకంగా కారోకాన్ డిఫెన్స్‌ను ఎంచుకున్నాడు. ప్రారంభంలో ఒక బంటును త్యాగం చేసినప్పటికీ, అతను సంక్లిష్టతలను బాగా నావిగేట్ చేశాడు. తొమ్మిదో రౌండ్ పోరులో ఈ చెన్నై కుర్రాడు చెక్‌కే చెందిన డేవిడ్ నవారాతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 9 రౌండ్లు ఉన్న ఈ టోర్నీలో అద్భుతంగా రాణించిన అరవింద్ 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌గా అవతరించాడు. ఆడిన రెండు క్లాసికల్ సూపర్ టోర్నమెంట్‌లలో అరవింద్ రెండింట్లోనూ విజేతగా నిలవడం విశేషం. ఈ టోర్నీలో ఫేవరేట్‌గా బరిలోకి దిగి ఏడో రౌండ్ వరకూ అరవింద్‌తో సమానంగా నిలిచిన మరో యువ భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 5 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అయితే ఏడవ రౌండ్‌లో ఆధిక్యంలోకి వచ్చిన తర్వాత అరవింద్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు.

## మాస్టర్స్ లీగ్‌లో.. ఆస్ట్రేలియా దూకుడు

### సౌతాఫ్రికాపై 137 పరుగుల భారీ తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్-2025లో ఆస్ట్రేలియామాస్టర్స్ జట్టు తమ దూకుడును కొనసాగిస్తోంది. వడోదరగా వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో137 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 260 పరుగుల భారీస్కోర్ సాధించింది. ఆసీస్ కెప్టెన్ షేన్ వాట్సన్ మరోసారి సెంచరీతో చెలరేగాడు. సౌతాఫ్రికా బౌలర్లను వాట్సన్ ఊచకోత కోశాడు. వాట్సన్ కేవ



లం 61 బంతుల్లోనే 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 122 పరుగులు చేసిఅజేయంగా నిలిచాడు. ఈ టోర్నీలో వాట్సన్‌కు ఇది మూడో సెంచరీ కావడం విశేషం. అంతకు ముందు వెస్టిండీస్, భారత్‌పై వాట్సన్‌శతకొట్టాడు. ఈమ్యాచ్‌లో షేన్‌తో పాటు, కల్లమ్ ఫెర్గూసన్ (43 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులతో 85), బెన్ డంక్ (16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. ప్రోటీస్ బౌలర్లలో పీటర్సన్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 17ఓవర్లలో 123 పరుగులకే ఆలౌటైంది. హషీమ్ ఆమ్లా (30) టాప్ స్కోరర్గా నిలవగా, రిచర్డ్ లివి (22), పీటర్సన్ పర్వాలేదని పించారు. మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో బెన్ లాఫ్లిన్ 3 వికెట్లు పడగొట్టగా, దొహర్టీ, మెక్‌గైన్ తలా రెండు వికెట్లు సాధించారు. వీరితో పాటు కౌల్టర్ నైల్, నాథన్ రియర్డన్ చెరో వికెట్ పడగొట్టారు.





# నేడే హోరాహోరీ పోరు

## ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజీలాండ్‌తో భారత్ ఢీ

### టీమిండియాలో వ్యూహాత్మక మార్పు

**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తుది పోరుకు టీమిండియా సిద్ధమవుతోంది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా 4 మ్యాచ్‌లు గెలిచి ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరిన టీమిండియా మంచి జోష్‌లో ఉంది. అదే జోరులో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి టైటిల్‌ను అందుకోవాలనే కసితో ఉంది. తద్వారా 2000 నాకౌట్ టోర్నీ, డబ్ల్యూటీసీ 2021 ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయాలకు ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో రోహిత్ సేన ఉంది. మరోవైపు సమష్టి ప్రదర్శనలతో ఫైనల్ చేరిన న్యూజిలాండ్ ఫైనల్లోనూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌నుఓడించాలనే పట్టుదలతోఉంది. లీగ్‌దశలో టీమిండియా చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలను కుంటుంది. ఆ జట్టులోనూ క్వాలిటీ స్పిన్ ఆల్‌రౌండర్లు ఉండటం కలిసొచ్చే అంశం. బలబలాల పరంగా ఇరు జట్లు సమంగా ఉన్నాయి. దాంతో ఫైనల్ పోరు హోరాహోరీగా సాగే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఫైనల్ మ్యాచ్‌కు టీమిండియా కాంబినేషన్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. టీమిండియా నలుగురు స్పిన్నర్లతోనే బరిలోకి దిగుతుందా? లేక ఎక్స్‌ట్రాపేసర్‌ను తీసుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో కుల్దీప్ యాదవ్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతేకాకుండా మైదానంలో అలసత్వం కనబర్చాడు. ఈ క్రమంలోనే అతని స్థానంలో పేసర్‌ను తీసుకోవాలనే ఆలోచనలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆసీస్‌తో సెమీస్ మ్యాచ్‌లో పిచ్‌పై ఎక్కువ టర్న్ లభించలేదు. ఫైనల్‌కు కూడా అదే తరహా పిచ్ ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఎక్స్‌ట్రా పేసర్‌గా హర్షిత్ రాణాను ఆడించాలని గంభీర్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. లేదు నలుగురు స్పిన్నర్లతోనే ఆడాలనుకుంటే మాత్రం తుది జట్టులో ఎలాంటి మార్పు జరిగే అవకాశం లేదు. ఇకబ్యాటింగ్ ఆర్డర్‌లో రోహిత్‌శర్మ, శుభ్‌మన్‌గిల్ ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. ఈ ఇద్దరూ గతరెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యారు. భారత్ విజయం సాధించాలంటే ఈ ఇద్దరూ శుభా రంభం అందించడం కీలకం. మిడిలార్డర్‌లో కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు జడేజాకు పెద్దగా బ్యాటింగ్ చేసేఅవకాశం రాలేదు. బౌలింగ్‌లో అతను సత్తా చాటుతున్నాడు. కుల్దీప్ యాదవ్ తన బౌలింగ్‌ను మెరుగుపర్చుకోవాల్సి ఉంది. షమీ అద్భుతంగా రాణిస్తున్నాడు. వరుణ్ చక్రవర్తి.. న్యూజిలాండ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 5 వికెట్లతో సత్తా చాటాడు. మరోసారి సమష్టి ప్రదర్శన కనబరిస్తే టీమిండియాకు తిరుగుండదు. న్యూజిలాండ్‌తో ఫైనల్ ఆడే భారత జట్టులో శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ(కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్/హర్షిత్ రాణా, మహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి.

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో.. ప్లే ఆఫ్స్‌కు దగ్గరగా గుజరాత్

### ఢిల్లీ క్యాపిటల్ చిత్తు

### టోర్నీ నుండి నిష్క్రమించిన తొలి జట్టుగా యుపి



**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్-2025 సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ ప్లే ఆఫ్స్ ముంగిట నిలిచింది. మరొక్క విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. టేబుల్ టాపర్స్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు షాకిచ్చి, ఏకంగా రెండో ప్లేస్‌కు చేరుకుంది. లక్నోలో జరిగిన ఈ లీగ్ మ్యాచ్‌లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 177 పరుగులు చేసింది. మెగ్ ల్యానింగ్ కెప్టెన్ ఇన్నింగ్స్ (57 బంతుల్లో 92, 15 ఫోర్లు, 1 సిక్సర్) తో చివరికంటా నిలిచి త్రుటిలో సెంచరీ చేజార్చుకుంది. బౌలర్లలో మేఘన సింగ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ను 19.3 ఓవర్లలో ఐదు వికెట్లకు 178 పరుగులతో పూర్తి చేసిన గుజరాత్, ఐదు వికెట్లతో ఘన విజయం సాధించింది. వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ డియోల్ అజేయ ఫిఫ్టీ (49 బంతుల్లో 70 నాటౌట్, 9 ఫోర్లు, 1 సిక్సర్)తో తుది వరకూ నిలిచి జట్టుకు విజయాన్ని సాధించి పెట్టింది. బౌలర్లలో జెస్ జొనాసెన్, శిఖా పాండేలకు తలో రెండు వికెట్లు దక్కాయి. ఈమ్యాచ్‌లో గెలిచి టాప్‌ప్లేస్‌తో ఏకంగాఫైనల్‌కు చేరుకుందామని భావించిన ఢిల్లీ ఆశలు ఆవిరయ్యాయి. ఓపెనర్లు ల్యానింగ్, షెఫాలీ వర్మ (27 బంతుల్లో 40, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) మంచి పునాది వేసినప్పటికీ, మిడిలార్డర్ బ్యాటర్లు దాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయారు. జెస్ జొనాసెన్ (9), జెమీమా రోడ్రిగ్స్ (4), మారిజానే కాప్(7)అటుబ్యాటింగ్‌లో విఫలమై, ఇటు బంతులు కూడా వేస్ట్ చేశారు. మధ్యలో అన్నాబెల్ సదర్లాండ్ (14) కాస్త వేగంగా ఆడే ప్రయత్నం చేసి ఔటయ్యింది. అయితే చివరి ఓవర్ వరకు నిలిచిన ల్యానింగ్ ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ, 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. అయితే ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో చివరి రెండు బంతులకు రెండు షాట్లు కొడితేసెంచరీ పూర్తవుతుందనే దశలో ఔటయ్యింది. బౌలర్లలో డియోంద్ర డాటిన్‌కు 2 వికెట్లు లభించాయి. ఇక ఛేజింగ్‌లో గుజరాత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. దయలాన్ హేమలత (1) త్వరగా ఔటైంది. అయితే మరో ఓపెనర్ బేత్ మూనీ (35 బంతుల్లో 44, 6 ఫోర్లు)తో కలిసి హర్లీన్ జట్టును ముందుకు తీసుకెళ్లింది. వీరిద్దరూ ప్రత్యర్థి బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. మెరుగ్గా స్ట్రైక్ రొటేట్ చేస్తూ, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు సాధించారు. దీంతో రెండోవికెట్‌కు 85 పరుగులభారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత మూనీ ఔటైనా, తర్వాత బ్యాటర్లతో కలిసి హర్లీన్ ఛేదనను పూర్తి చేసింది. డియోంద్ర (24), కెప్టెన్ యాష్లే గార్డెనర్ (22) హర్లీన్‌కు సహకారం అందించడంతో ఛేజింగ్ సజావుగా సాగింది. చివర్లో 3వికెట్లు పడిపోయి కాస్త ఉత్కంఠ రేగినా, హర్లీన్ చివరికంటా నిలిచి జట్టుకు విజయాన్ని అందించింది. 38 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. మిగతాఢిల్లీ బౌలర్లలో మిన్నుమణికి ఒక వికెట్ దక్కింది. ఈ విజయంతో గత రెండు సీజన్లలో అట్టడుగు స్థానంలో నిలిచిన గుజరాత్, ఈసారి మాత్రం తొలిసారి దాదాపుగా ప్లే ఆఫ్ బెర్తును ఖరారు చేసుకున్నట్లే. అలాగే యూపీ వారియర్స్ జట్టు టోర్నీ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా నిలిచింది. ఇక డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తమ మిగతా రెండు మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధిస్తేనే, నాకౌట్ రేసులో నిలుస్తుంది. లేకపోతే ఆ జట్టు కూడా రేసు నుంచి నిష్క్రమిస్తుంది.

# మొదటి స్థానాన్ని కోల్పోయిన 'హీరో'


**ముంబై, మార్చి 8:** ఈసారి ఆటో పరిశ్రమలో ద్విచక్ర వాహన మార్కెట్లో పెద్ద మార్పు కనిపించింది. తొలి సారిగా ద్విచక్ర వాహన మార్కెట్లో హీరో నంబర్ వన్ స్థానం నుండి మూడో స్థానానికి పడిపోయింది. అతిపెద్ద ద్విచక్ర వాహన విక్రయ సంస్థ హీరో మోటోకార్ప్ అమ్మకాలలో భారీ క్షీణత ఉంది. దీనిని టీవీఎస్ మోటార్స్ కూడా అధిగమించింది. ఫిబ్రవరి 2025లో హీరో మోటోకార్ప్ 3,88,068 యూనిట్లను విక్రయించింది. గత సంవత్సరం ఇదే నెలతో పోలిస్తే 17.2 శాతం తక్కువ వాహనాలు అమ్ముడయ్యాయి. దీని తరువాత, హీరో మోటోకార్ప్ మొదటిసారి మూడవ స్థానానికి చేరుకుంది. టివిఎస్‌మోటార్ ఫిబ్రవరి 2025లో మొత్తం 4,03,976 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరం కంటే 9.6 శాతం ఎక్కువ. అదే సమయంలో హీరో మోటోకార్ప్ అమ్మకాలు 17.2శాతం తగ్గాయి. అమ్మకాలలో టీవీఎస్ హీరోమోటోకార్ప్‌ను అధిగమించడం ఇదే మొదటిసారి. చెన్నైకి చెందిన ఈ కంపెనీ ఫిబ్రవరిలో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేయగా,




ఇతర ద్విచక్ర వాహన కంపెనీ లు అమ్మకాలలో తగ్గుదల లేదా స్వల్ప వృద్ధిని నమోదు చేయగా, టీవీఎస్ ఎగుమతిలో 26శాతం వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరిలో టీవీఎస్ ఎగుమతులు 98,856 యూనిట్ల నుంచి 1,24,993 యూనిట్లకు పెరిగాయి. దాని ఎలక్ట్రిక్ స్కూటర్ల అమ్మకాలు కూడా 34శాతం పెరిగి 24,017 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ మార్పు ద్విచక్ర వాహన మార్కెట్లో పోటీ తీవ్రంగా మారుతోందని, టీవీఎస్ తన అమ్మకాలను పెంచుకోవడంలో గొప్ప విజయాన్ని సాధించిందని సూచిస్తుంది. హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) 4,22,449 యూనిట్ల అమ్మకాలతో మొదటి స్థానంలో ఉంది. కానీ ఇప్పటికీ దీని గురించి పెద్దగా చర్చకు రాలేదు. ఎందుకంటే గత సంవత్సరం ఇదే నెలతో పోలిస్తే హోండా మోటార్‌సైకిల్ 7.9శాతం తక్కువ వాహనాలను విక్రయించింది. బజాజ్ ఆటో నాల్గవ స్థానంలో ఉంది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 1.6 శాతం ఎక్కువ అమ్మకాలను చూపించింది.

# మితిమీరిన ట్రేడింగ్ కట్టడికే కఠిన నిబంధనలు


**ముంబై, మార్చి 8:** ఇండెక్స్ డెరివేటివ్స్‌లో ఎక్స్‌పైరీ రోజున మితిమీరిన ట్రేడింగ్ కట్టడికే నిబంధనలను కఠినతరం చేస్తున్నట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబి హోల్‌టైమ్ సభ్యుడు అనంత నారాయణ్ తెలిపారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోతున్నారని అధ్యయనంలో తేలిన మీదట గతేడాది అక్టోబరులో చర్యలు ప్రకటించినట్లు ఆయన చెప్పారు. కనీస కాంట్రాక్టు పరిమాణాన్ని రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షలకు దశల వారీగా పెంచడం, ప్రీమియంను ముందుగా వసూలు చేయడం తదితర చర్యలను సెబి ప్రకటించింది. ముందుగా క్యాష్ మార్కెట్‌ను అభివృద్ధి చేసి, ఆ తర్వాత డెరివేటివ్స్‌పై కసరత్తు చేయాలని స్టాక్ ఎక్స్చేంజీలకు సూచించారు. మరోవైపు పరస్పర విరుద్ధ ప్రయోజనాల వివరాలను సెబి బోర్డు సభ్యులందరూ ప్రజలకు వెల్లడించడాన్ని తప్పనిసరి చేసేలా నిబంధలను రూపొందిస్తామని సెబి కొత్త చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. విశ్వసనీయతను, పారదర్శకతను పెంపొందించడానికి ఇది ఉపయోగ పడగలదని ఆయన వివరించారు. ఓ వైపు నియంత్రణ సంస్థ అధిపతిగా, మరోవైపు నియంత్రిత



సంస్థల్లో భాగస్వామిగా పరస్పర విరుద్ధ ప్రయోజనల కోసం పని చేశారంటూ సెబి మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పాండే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెబి విచారణ ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ సంస్థ సహ-ఇన్వెస్టరుగా ఉన్న ఫండ్‌లో ఆమె పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# రూ.3.47 లక్షల కోట్లకు భారత్ సెమీకండక్టర్ పరిశ్రమ

**న్యూఢిల్లీ, మార్చి 8:** భారతీయ సెమీకండక్టర్ పరిశ్రమ 2023 నాటికి 40బిలియన్ డాలర్ల అంటే రూ.3.47 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ అసోసియేషన్ ఐఇఎస్‌ఎ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీలో కీలకమైన కెమికల్స్, గ్యాస్ సహా సరఫరా వరకు అన్ని రకాల విభాగాల్లో పెట్టుబడులు, రాబడి పెరగనున్న నేపథ్యంలో ఇది సాధ్యమవుతుందని తెలిపారు. సెమీకండక్టర్ల తయారీ క్లిష్ట మైన టెక్నాలజీతో కూడుకున్నది, ఈ విషయంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సెమీకండక్టర్ల తయారీ నుంచి భారత్ నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒక దగ్గర తయారయ్యే చిప్ ఏదైనా 10 కంటే ఎక్కువ దేశాలకు చేరుతుంది. ఈ నేపథ్యంలో భారత సెమీ కండక్టర్ తయారీ విజయవంతం కావాలంటే వాటి తయారీలో కీలకమైన కెమికల్స్, గ్యాస్ వంటి వాటి సరఫరాను సమర్థవంతంగా నిర్వహించాలని కూడా వివరించారు. అన్ని రకాల అడ్డంకులను, సమస్యలను అధిగమిస్తే ప్రపంచ సెమీ కండక్టర్ తయారీలో భారత్ కనీసం 10శాతం వాటాను అందుకోగలదు. 2030 నాటికి ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ 420 బిలియన్ డాలర్లకు చేరుకోగలదనే అంచనాలు ఉన్నాయి. ఇందులో 10శాతం అంటే కనీసం 40 బిలియన్ డాలర్లను భారత్ సాధించగలదు. ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ సంస్థలు భారత్ మార్కెట్‌కు తరలి రావడం, మన దేశం నుంచి ఎగుమతులు చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఐఇఎస్‌ఎ నివేదిక ప్రకారం, 2026-27 నాటికి సెమీకండక్టర్ విభాగంలో సుమారు 15 లక్షల మందికి ఉపాధి కల్పించనుండగా, మరో 50 లక్షల మందికి పరోక్ష ఉపాధి అందించనుంది. ప్రధానంగా ప్రాసెసింగ్, ఎక్విప్‌మెంట్ ఇంజనీర్, టెస్టింగ్ ఇంజినీర్లు, కెపాసిటీ ప్లానింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు లభించనున్నాయి. వచ్చే రెండు మూడేళ్లలో డిజైన్, తయారీ, ట్రైనింగ్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ వంటి పోస్టులకు అధిక డిమాండ్ ఉంటుందని నివేదిక తెలిపింది.సహజంగానే ఈ పరిశ్రమలో పురుషుల ఆధిపత్యం ఉన్నప్పటికీ, ప్రభుత్వంతో పాటు కంపెనీల సరైన నిర్ణయాలతో 2030 నాటికి మహిళల భాగస్వామ్యం 35శాతానికి చేరుకోవచ్చన్నారు.



# 3 మిలియన్ టన్నులు గోధుమ దిగుమతులు

**ముంబై, మార్చి 8:** ఆహార ఆర్థికవ్యవస్థను స్థిరీకరించేందుకు భారతప్రభుత్వం 2025 ఆర్థికసంవత్సరంలో మూడు మిలియన్ టన్నుల (ఎంటి) గోధుమలను బహిరంగ మార్కెట్ నుంచి దిగుమతి చేసుకుంది. ఆహార ధాన్యాల నిల్వల నిర్వహణ, మార్కెట్లో ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) ఈచర్యలను అమలుచేసినట్లు మార్కెట్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఇటీవల కాలం వరకు మిగులు గోధుమ నిల్వలను బహిరంగ మార్కెట్లో విక్రయించారు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఓఎంఎస్ఎస్) కింద 2024 ఆర్థిక సంవత్సరంలో బల్క్ కొనుగోలుదారులకు రికార్డుస్థాయిలో 10 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించడం విశేషం. 2023-24 పంటసంవత్సరానికి భారతదేశ గోధుమ ఉత్పత్తి 113.29 మెట్రిక్ టన్నులుగా అంచనా వేశారు. ఇది బలమైన సరఫరాను నిర్ధారిస్తుంది. అయితే మిగులు నిల్వలను మార్కెట్ డిమాండ్లతో సమతుల్యం చేసేందుకు ప్రభుత్వం గతంలో సవాళ్లు ఎదుర్కొంది. కానీ ఇటీవల దేశీయ గోధుమల లభ్యత తగ్గిపోవడంతో దిగుమతులపై ఆధారపడుతుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో మూడు మెట్రిక్ టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవడం ద్వారా తక్కువ కాలంలో ధాన్యంలభ్యతను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బల్క్ కొనుగోలుదారులు, ప్రాసెసర్లకు ధాన్యాన్ని విక్రయించడానికి ఇటీవల నిర్వహించిన వీక్లీ ఆక్షన్‌లో ఎఫ్‌సిఐ 0.49 మెట్రిక్ టన్నుల గోధుమలను విక్రయించింది. అంతకు ముందు వారం కంటే క్వింటాలుకు కనీసం రూ.200 తక్కువకు అమ్ముడయ్యాయని వాణిజ్య వర్గాలు తెలిపాయి. కొత్త మార్కెటింగ్ సీజన్ కోసం మధ్యప్రదేశ్‌లో మార్చి 15న సేకరణ కార్యకలాపాలు ప్రారంభం కానున్నందున వీక్లీ ఇ-ఆక్షన్ కొనసాగే అవకాశం లేదని వర్గాలు తెలిపాయి. గతేడాది ఏప్రిల్ 1న ఎఫ్‌సిఐ వద్ద 7.46 మెట్రిక్ టన్నుల గోధుమలు నిల్వ ఉండగా, ఈసారి 13.55 మెట్రిక్‌టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి. పరిశ్రమ అంచనాల ప్రకారం గోధుమ నిల్వలు ఈ యేడాది ఏప్రిల్ 1న 10-11 మెట్రిక్ టన్నుల మధ్య ఉండే అవకాశం ఉంది. ఇది బఫర్ కంటే కొంచెం ఎక్కువగా ఉంది. 2024-25 సీజన్‌లో కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి క్వింటాలుకు రూ.2425 కంటే మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కింటాలుకు రూ.125 బోనస్ ప్రకటించారు.



## వాణిజ్యం


# 'చాయ్ పాయింట్' లిస్టింగ్!

**న్యూఢిల్లీ, మార్చి 8:** టీ, కాఫీ చైన్ చాయ్ పాయింట్ 2026 మే నెలకల్లా స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టయ్యే ప్రణాళికల్లో ఉంది. ఈ అంశాన్ని ప్రతిరోజు సుమారు 9 లక్షల కప్పుల టీ, కాఫీ విక్రయిస్తున్న సంస్థ సహవ్యవస్థాపకుడు తరుణ్ ఖన్నా తెలియచేశారు. అయితే కుంభమేళాలో రోజుకి 10 లక్షల కంటే అధికంగా విక్రయించినట్లు తెలియజేశారు. ముంబైలో తమ విద్యార్థి అములీక్ సింగ్ బిజ్రాల్‌తో కలిసి ఒక కేఫ్‌లో టీ తాగే సమయంలో 2009లో చాయ్ పాయింట్ ప్రారంభించే ఆలోచన వచ్చినట్లు హార్వార్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఖన్నా వెల్లడించారు. ప్లాస్టిక్ కప్పులలో అంత శుభ్రతలేని విధంగా అందిస్తున్న చాయ్ స్థానే అత్యున్నత నాణ్యతతో, పరిశుభ్రంగా అందుబాటు ధరలో సువాసనలతో కూడిన చాయ్ అందించాలనే ఆలోచనతో చాయ్ పాయింట్‌కు తెరతీసినట్లు వివరించారు. దీంతో టీ అందించే వ్యక్తులకు ఉపాధిని కూడా కల్పించవచ్చని భావించినట్లు తెలియచేశారు. దీంతో 2010లో బెంగళూరులోని కోరమంగళలో తొలి ఔట్‌లెట్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అములీక్‌తో కలిసి ఐదుగురు ఉద్యోగులతో బిజినెస్‌ను మొదలుపెట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజుకి 90 లక్షల కప్పుల టీ, కాఫీలను విక్రయిస్తున్నట్లు తెలియచేశారు.




# అల్ట్రావయలెట్ 'ఇవి' ఆఫర్ పొడిగింపు!

**ముంబై, మార్చి 8:** విద్యుత్ మోటార్ సైకిళ్ల తయారు చేసే స్టార్టప్ సంస్థ అల్ట్రావయలెట్ తొలిసారిగా దేశీయ మార్కెట్లోకి లాంచ్ చేసిన 'ఇవి' స్కూటర్ మంచి డిమాండ్ సొంతం చేసుకుంది. టెసెరాక్ట్ పేరుతో తీసుకొచ్చిన ఈ బైక్ ప్రీ బుకింగ్ మొదలైన 48 గంటల్లోనే 20వేలకుపైగా ప్రీ బుకింగ్‌లు సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని కంపెనీ తాజాగా వెల్లడించింది. టెసెరాక్ట్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.20 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. అయితే తొలి 10వేల మంది కస్టమర్లకు మాత్రమే ఈ ధరకు విక్రయిస్తామని లాంచింగ్ సమయంలోనే తెలిపింది. మార్చి 5 నుంచి 'ఇవి' ప్రీ బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. మొదలైన 48 గంటల్లోనే 20వేల ప్రీ బుకింగ్‌లను అందుకుంది. దీంతో కంపెనీ కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 50వేల వాహనాలనూ లాంచ్ ధరతోనే విక్రయించాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని తాజాగా వెల్లడించింది. అంటే 50వేల బుకింగ్‌ల తర్వాత అల్ట్రావయో లెట్ టెసెరాక్ట్ ధర రూ.1.45 లక్షలుగా ఉండనుంది. ఎలక్ట్రిక్ స్కూటల్ డెలివరీలు 2026 మొదటి త్రైమాసికం నుంచి ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. రూ.999 వెచ్చింది. ప్రీ బుకింగ్ చేసుకోవచ్చని వెల్లడించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *r esponsible for selection of News under the Pr B Act. r NI No.APTEL/2001/7563.Postal Licence r egd. No. H/KAr /89/12-14